ఈనాడు
ప్రకాశం
సోమవారం 21 అక్టోబరు 2024



గండిని ఇసుక బస్తాలతో నింపుతున్న రైతులు

ముప్పవారిపాలెం చెరువుకు గండి

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి మండలం ముప్పవారిపాలెం చెరువుకు ఆదివారం తెల్లవారు జామున గండి పడింది. గత అయిదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువు అవుట్‌లెట్ తూము వద్ద లీకేజీ ఏర్పడింది. అది క్రమంగా పెరిగి పెద్ద మొత్తంలో నీరు బయటకు పోతోంది. విషయం గమనించిన రైతులు వెంటనే అప్రమత్తమయ్యారు. రెవెన్యూ, నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లారు. స్థానిక తెదేపా నాయకులు, ఆయకట్టు రైతులు అక్కడకు చేరుకుని... జేసీబీ, ఇసుక బస్తాలతో గండిని పూడ్చే ప్రయత్నం చేశారు. ప్రయోజనం లేకపోవడంతో టిప్పర్లతో మట్టి తెప్పించి ఆ ప్రాంతంలో పోయించారు. అనంతరం ఇసుక బస్తాలు నింపడంతో సాయంత్రానికి ఆపగలిగారు. అప్పటికే చాలా నీరు దిగువకు పోయినా... పెద్ద ప్రమాదం తప్పడంతో ముప్పవారిపాలెం, మర్రిపాలెం, గుడిపూడివారిపాలెం రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



జేసీబీతో పూడ్చుతున్న దృశ్యం

రీసర్వే తప్పులు.. రైతులకు తలనొప్పులు

- గత ప్రభుత్వ తీరుతో నేడు పథకాలూ అందని దుస్థితి



న్యూస్‌టుడే - ఒంగోలు గ్రామీణం

భూ వివాదాలకు తావులేకుండా రెవెన్యూ దస్త్రాలు సరిచేస్తామంటూ గత వైకాపా ప్రభుత్వం... వైఎస్సార్ జగనన్న భూరక్ష పేరిట రీసర్వే చేపట్టింది. సమస్యల తీరడం మాట అటుంచితే... నాటి తప్పిదాల కారణంగా రైతులకు ఇప్పుడు కొత్త చిక్కులు తలెత్తుతున్నాయి. అర్హత ఉన్నా పంట రుణాలు, రాయితీ పథకాలు పొందేందుకు వీల్లేకుండా పోయింది.

> ప్రస్తుతం చిన్న, సన్నకారు రైతులకు బిందు, తుంపర సేద్యం పరికరాలను భారీ రాయితీపై ప్రభుత్వం అందిస్తోంది. పండ్ల తోటల సాగునూ ప్రోత్సహిస్తోంది. సంయుక్త ఎల్‌పీఎం నంబరులో పొలం ఉన్న రైతులకు అడంగల్ కాపీ రాక పోవడంతో ఈ పథకాల లబ్ధిని కోల్పోవాల్సి వస్తోంది.


అడ్డగోలుగా వివరాల నమోదు...

అడంగల్‌లో ఉన్న విస్తీర్ణం కంటే కొందరికి తక్కువగా, మరికొందరికి ఎక్కువగా నమోదు చేశారు. కొన్ని భూముల వివరాలు అసలు నమోదే చేయలేదు. వాలిడేషన్ ప్రక్రియ అనంతరం జారీ చేయాల్సిన 9(2) నోటీసులను చాలా ప్రాంతాల్లో ఇవ్వలేదు. ఈ క్రమంలో గందరగోళం తలెత్తి తహసీల్దార్ కార్యాలయాల వద్ద రైతులు ఆందోళనలు చేసినా సమస్యలు పరిష్కరించలేదు. ఇప్పటికీ ఆ తప్పులు కొనసాగుతున్నాయి.

వెబ్‌ల్యాండ్‌లో నమోదైన తప్పుడు వివరాలతో వేలాది మంది రైతులు అవస్థలు పడుతున్నారు. 'పూర్వీకుల నుంచి వీలునామాగా తమ కుమారుడికి మద్దిపాడు గ్రామ సర్వే నం. 436/1లో 5.52 ఎకరాలు సంక్రమించగా... రీసర్వేలో 4.42 ఎకరాలు మాత్రమే ఆన్‌లైన్ చేశారు. అప్పట్లోనే సర్వేయర్‌ను సంప్రదిస్తే తరువాత చూద్దాంలే అంటూ కాలయాపన చేశారు. 1.10 ఎకరాలు తగ్గినా పట్టించుకోవడం లేద'ని గ్రామానికి చెందిన బత్తిని సురేంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నం.310లో వారసత్వంగా 7.12 ఎకరాలు సంక్రమించినా... రీసర్వే చేశాక 6.62 ఎకరాలు మాత్రమే ఆన్‌లైన్ చేశారు. యాభై సెంట్లు తగ్గడంతో రెవెన్యూ, సర్వే అధికారులకు అర్జీలు ఇచ్చాం. అయిదు నెలలుగా కాలయాపనే తప్ప సరిచేసింది లేద'ని అదే గ్రామానికి చెందిన నట్టే సుబ్బారావు వాపోయారు.

రుణాలు, రాయితీల లబ్ధికీ చిక్కులు...

డ్రోన్ ద్వారా సర్వే చేశాక... సర్వే నంబరు, సబ్ డివిజన్ వారీగా కాకుండా ఏకీకృత ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్)గా వివరాలు నమోదు చేశారు. అంటే... ఆ సర్వే నంబరులో భాగంగా ఉన్న రైతులందరికీ ఒకే ఎల్‌పీఎం కేటాయించారు. దీంతో ఎవరికివారుగా 1బీ, అడంగల్ కాపీలు తీసుకునే అవకాశం లేకుండా పోయింది. ప్రస్తుతం రబీ సీజన్ కావడంతో రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఇందుకు అడంగల్ కాపీలు అవసరం. పాత రుణం నవీకరించుకోవాలన్నా ఇవి తప్పనిసరి. రీసర్వే తప్పిదాల కారణంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆ కాపీలు రావడం లేదు. అత్యవసరమైన వారు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకపోతోంది. భూముల క్రయ విక్రయాలకూ సాంకేతిక చిక్కులు అడ్డంకిగా మారుతున్నాయి. ఈ కారణంగా పిల్లల చదువులు, వివాహాల కోసం భూములు అమ్మాలనుకుంటున్న వారికి ఇబ్బందులు తప్పడం లేదు.



'మీ కోసం' ఫిర్యాదులన్నీ అవే...

గత ప్రభుత్వ హయాంలో ప్రతి సోమవారం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో నిర్వహించిన స్పందనతో పాటు... ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపడుతున్న 'మీ కోసం' కార్యక్రమానికి వచ్చిన అర్జీలను పరిశీలిస్తే భూ సమస్యలకు సంబంధించినవే అధికంగా ఉంటున్నాయి. కూటమి సర్కారు కొలువు దీరాక ఇప్పటి వరకు కలెక్టరేట్ నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి దాదాపు మూడు వేల వినతులు రాగా... వీటిలో 2,600కు పైగా రెవెన్యూ, భూసమస్యలవే కావడం సమస్య తీవ్రతను తెలియజెబుతోంది.

డివిజన్ల వారీగా రీసర్వే వివరాలిలా...

డివిజన్	మండలాలు	గ్రామాలు	రీసర్వే చేసిన విస్తీర్ణం (ఎకరాల్లో)	ఎల్‌పీఎంల సంఖ్య
ఒంగోలు	12	114	2,19,393.20	1,48,037
కనిగిరి	13	126	2,38,348.13	1,26,983
మార్కాపురం	13	58	97,717.04	69,658



చింతలపాలెంలో స్థిరాస్తి వ్యాపారులు పూడ్చేశారిలా...



కలగట్ల సమీపంలో ఆక్రమణకు గురైన చెక్‌డ్యాం

వరదంతా సముద్రం పాలు

- జల వనరుల్లో నీరు నిలిచింది లేదు
- చెక్‌డ్యాంలు, కుంటలను నిర్లక్ష్యం చేసిన ఫలితం

న్యూస్‌టుడే - కనిగిరి

జిల్లాలో గత అయిదు రోజులుగా భారీ వర్షాలు పడుతున్నా... ఏ చెరువులోనూ చెప్పుకోదగ్గ స్థాయిలో నీరు చేరింది లేదు. మొత్తం జలమంతా వృథాగా సముద్రంలోకే పోయింది. గత అయిదేళ్లుగా చెక్‌డ్యాంలు, నీటి కుంటల నిర్వహణను గాలికొదిలేయడమే దీనికి ప్రధాన కారణం. ఆయా వనరుల్లో నీరు నిలిస్తే భూగర్భ జలాలు పెరిగి జిల్లా వాసులకు ఎంతో ప్రయోజనం చేకూరేది.

అయిదేళ్లుగా గాలికొదిలేసి...

రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదయ్యేది అనంతపురం కాగా... తరువాతి స్థానం ప్రకాశం జిల్లాదే. అందునా పశ్చిమ ప్రకాశంలో పరిస్థితి మరీ దారుణం. కనిగిరి, పొదిలి, మార్కాపురం వంటి చోట్ల ఆరు వందల అడుగుల లోతు తవ్వినా చుక్కనీరు పడని దుస్థితి. ఈ నేపథ్యంలో జిల్లాలో పడిన ప్రతి వాన చుక్కనూ ఒడిసి పట్టేందుకు 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. భూగర్భ జలాలే పెంపే లక్ష్యంగా నాబార్డు, వాటర్ షెడ్ పథకాల కింద జిల్లాలో 3,834 చెక్ డ్యాంలు, నీటి కుంటలు నిర్మించారు. నిత్యం నీటి ఎద్దడి ఉండే కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాల పరిధిలోనే ఎక్కువగా నిర్మించారు. ఒక్కో చెక్‌డ్యాంకు పరిధిని బట్టి రూ.5 లక్షలు, నీటి కుంటకు రూ.6 లక్షలు చొప్పున వెచ్చించారు. తరువాతా వీటి నిర్వహణపై దృష్టి పెట్టారు. మొత్తంగా రూ.30 కోట్లకు పైగా ఖర్చు చేశారు. ఈ చర్యలు ఫలితమిచ్చాయి. ఒక్క కనిగిరి ప్రాంతంలోనే రెండు మీటర్ల మేర భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. బోర్లు, బావుల్లో నీటి లభ్యత పెరిగింది. రైతులతో పాటు... పశుపక్ష్యాదులకు సైతం ఎంతో ప్రయోజనం చేకూరింది. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నిర్వహణకు ఒక్క పైసా విదల్చలేదు. దీంతో చాలా వరకు చెక్‌డ్యాంలు పగుళ్లిచ్చి, ధ్వంసమయ్యాయి. మట్టితో పూడిపోయి, చిల్లచెట్లు పెరిగి రూపుకోల్పోయాయి.

ఆక్రమణలు సైతం...

కనిగిరి నియోజవర్గం పరిధిలోని కనిగిరి, వెలిగండ్ల, పామూరు, పీసీపల్లి, హనుమంతునిపాడు, సీఎస్‌పురం మండలాల్లో 854 చెక్ డ్యాంలు, కుంటలు నిర్మించగా... అయిదేళ్ల నిర్లక్ష్యం కారణంగా చాలావరకు ఆనవాళ్లు లేకుండా పోయాయి. మరోవైపు కొందరు వైకాపా నాయకులు వీటిని ఎక్కడికక్కడ ఆక్రమించారు. ఆ సమీపంలో వేసిన లే అవుట్‌లలో కలిపేసుకుని... ప్లాట్లుగా మార్చి విక్రయించారు. వాగులు, వంకలను సైతం విడిచి పెట్టలేదు. ఈ కారణంగా ఎంత వాన పడినా ఎక్కడా నీరు నిలవడం లేదు. గత అయిదు రోజులుగా భారీ వర్షాలు పడినా... మొత్తం జలాలు వృథాగా సముద్రంలోకే పోయాయి. ఈ విషయమై ఉపాధి హామీ ఏపీడీ రాజారావును వివరణ కోరగా... చెక్ డ్యాంలు, నీటి కుంటల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపామని తెలిపారు. వారు పరిశీలించాక... పునరుద్ధరణ దిశగా చర్యలు చేపడతామని చెప్పారు.



పోలవరం రోడ్డులో ఆనవాళ్లు కోల్పోయి ఆక్రమణలో ఉన్న నీటి కుంట

నేటి నుంచి పోలీసు అమర వీరుల వారోత్సవాలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా అన్ని స్టేషన్ల పరిధిలో సోమవారం నుంచి ఈ నెల 31 వరకు పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలతో పాటు... ఓపెన్ హౌస్, రక్త దాన, వైద్య శిబిరాలు, ఏక్తా దివస్ తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు. తొలిరోజున ఉదయం 7.45 గంటలకు ఒంగోలులోని పోలీసు కవాతు మైదానంలో పెరేడ్‌తో పాటు... విధి నిర్వహణలో అమరులైన పోలీసు వీరులకు నివాళులర్పించనున్నారు.

ప్రమాదమైనా పట్టదు!

సంతనూతలపాడు - ఒంగోలు మధ్య కర్నూలు రోడ్డులో కనిపించిన దృశ్యమిది. కనీస జాగ్రత్తలు లేకుండా ఓ టిప్పర్‌లో ప్రమాదకరంగా ఇలా రాళ్లను తరలిస్తున్నారు. ఏ మాత్రం రాయి దొర్లిపడినా వెనుక వచ్చే వాహనదారులకు ప్రమాదం తప్పదు. చీమకుర్తి, పేర్నమిట్ట సమీపంలో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసినా ఈ తరహా రవాణాకు అడ్డుకట్ట పడకపోవడం గమనార్హం.

\- న్యూస్‌టుడే, సంతనూతలపాడు



సింగరాయకొండలో అత్యధిక వర్షపాతం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. మండలాల వారీగా చూస్తే సింగరాయకొండలో అత్యధికంగా 65.2 మి.మీ., చీమకుర్తి 59.0, ఒంగోలు 50.4, కొనకనమిట్ల 48.0, కొత్తపట్నం 44.0, పొదిలి 42.4, సంతనూతలపాడు 30.6, జరుగుమల్లి 29.2, పామూరు 24.2, పొన్నలూరు 24.2, కురిచేడు 20.0, కనిగిరి 19.6, టంగుటూరు 19.5, పీసీపల్లి 17.2, సీఎస్‌పురం 16.2, నాగులుప్పలపాడు 15.6, దొనకొండ 14.0, దర్శి 12.4, మద్దిపాడులో 11.0 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

ప్రాథమిక విద్యకు పునరుజ్జీవం

- 117 జీవో రద్దుకు సీఎం చంద్రబాబు నిర్ణయం
- జిల్లాలోని బడులకు ఎంతో ప్రయోజనం




న్యూస్‌టుడే - ఒంగోలు నగరం

గత ప్రభుత్వ తప్పిదంతో గాడి తప్పిన ప్రాథమిక విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం తొలి అడుగు వేసింది. అనాలోచితంగా వైకాపా సర్కారు అమల్లోకి తెచ్చిన 117 జీవోను... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ విషయమై ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

404 పాఠశాలలు విలీనం...

తగిన కార్యాచరణ, తలెత్తే పర్యవసానాలు ఆలోచించకుండా గత ప్రభుత్వం తెచ్చిన 117 జీవోతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ నిర్వీర్యమైంది. మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లతో బోధన చేయిస్తామని... 3, 4, 5 తరగతులను కిలో మీటరు దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. ఈ నిర్ణయం విపరిణామాలకు దారితీస్తుందని ఉపాధ్యాయ సంఘాలు ఎంత చెప్పినా పెడచెవిన పెట్టింది. చివరకు ప్రాథమిక బడుల ఉనికికే ముప్పు తెచ్చింది. జీవో అమల్లో భాగంగా జిల్లాలోని 404 ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల పిల్లలను 272 ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ఈ క్రమంలో పలు సమస్యలు ఉత్పన్నమయ్యాయి. నిబంధన ప్రకారం ప్రతి తరగతికి ఒక గది ఉండాలి. ప్రతి సబ్జెక్టుకు ఒక టీచర్ ఉండాలి. ఈ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో... గదులు లేక చాలాచోట్ల వరండాల్లో పిల్లలను కూర్చోపెట్టారు. కొన్ని చోట్ల ఒకే గదిలో రెండేసి తరగతులు నిర్వహించారు. 2022లో విలీనం చేపడితే... 2023 విద్యాసంవత్సరం చివరిలో పదోన్నతులు కల్పించి ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. ఆ విధంగా ఒక బ్యాచ్ విద్యార్థులకు సరైన బోధన లభించలేదు.



- 3, 4, 5 తరగతుల విలీనం తరువాత ఏటా ఒకటో తరగతి ప్రవేశాలు పడిపోయాయి. మరోవైపు... తొలి విడత నాడు - నేడు కింద ఆయా ప్రాథమిక పాఠశాలల్లో నిర్మించిన అదనపు తరగతి గదులు నిరుపయోగంగా మారాయి. అవసరమైన చోట గదులు కొరత తలెత్తింది.



320 ఏకోపాధ్యాయ పాఠశాలలు...

ఈ జీవోతో తలెత్తిన మరో ప్రధాన సమస్య... ప్రాథమిక పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గిపోవడం. దూరంగా ఉన్న ఉన్నత పాఠశాలలకు పిల్లలను పంపేందుకు చాలామంది తల్లిదండ్రులు ఇష్టపడలేదు. ప్రైవేటు వైపు మొగ్గు చూపారు. అలా ఏటా పదిహేను శాతం మేర ప్రవేశాలు పడిపోయాయి. దీంతో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిలో తేడా వచ్చింది. నిబంధనల ప్రకారం 20 మంది పిల్లలకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో ఎక్కువ మంది ఉన్న చోటుకు టీచర్లను బదిలీ చేశారు. ఈ క్రమంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగాయి. మద్దిపాడు మండలం దొడ్డవరప్పాడు ప్రాథమిక పాఠశాలలో విలీన ప్రక్రియకు ముందు 26 మంది పిల్లలు ఇద్దరు టీచర్లు ఉండగా... తరువాత ఒకరికే పరిమితం చేశారు. దాదాపు నలభై మంది పిల్లలు, ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులతో కళకళలాడిన చీమకుర్తి మండలం మైలవరం, పల్లామల్లి, గురవారెడ్డిపాలెం, సంతనూతలపాడు సీఈ, పి.గుడిపాడు తదితర పాఠశాలలు సైతం ఇప్పుడు కునారిల్లుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 320 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి.

---

4 నుంచి ఎస్‌ఏఎంపీ-2 పరీక్షలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: పాఠశాలల్లో ఈ నెల 24 నుంచి జరగాల్సిన ఎస్‌ఏఎంపీ (సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్) పరీక్షలు నవంబర్ 4 నుంచి 7 వరకు నిర్వహించాలని నిర్ణయించినట్లు విద్యాశాఖ డీసీఈబీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఎంఈవోలకు షెడ్యూలు పంపించామన్నారు. గతంలో వాట్సాప్ ద్వారా ప్రశ్నపత్రాలు పంపే విధానం ఉండగా... ఇప్పుడు డీసీఈబీ ద్వారా ప్రశ్నపత్రాలు ముద్రించి అందజేస్తున్నట్లు చెప్పారు. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలు ఉంటాయని వివరించారు.

బంగారం కోసం వృద్ధురాలి హత్య

- సీఎస్‌పురం మండలం డీజీపేటలో ఘోరం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: ఒంటిపై ఉన్న బంగారం కోసం ఓ వృద్ధురాలిని దారుణంగా హత్య చేశారు. సీఎస్‌పురం మండలం డీజీపేటలో ఆదివారం ఈ దారుణం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన డేగా రత్తమ్మ (58)కు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. వీరందరికీ వివాహాలై ఉపాధి నిమిత్తం వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. భర్త మూడేళ్ల క్రితమే చనిపోవడంతో ఆమె ఒంటరిగా ఉంటున్నారు. ఖాళీగా ఉండడం ఇష్టం లేక... వారికున్న భూమిలో గ్రాసం సాగు చేస్తూ పశుపోషణ సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం పదిన్నర గంటల సమయంలో... పశువులకు గ్రాసం తెచ్చేందుకు దర్శిగుంట్ల దారిలోని మామిడితోట సమీపంలోకి వెళ్లారు. గ్రాసం కోస్తున్న సమయంలో... దుండగులు బలమైన ఆయుధంతో ఆమె తలపై దాడి చేశారు. దీంతో ఆమె ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మెడలోని బంగారు తాడు తీసుకుపోయారు. కమ్మలు లాగడంతో ఆమె చెవులు తెగాయి. చీకటి పడినా ఆమె ఇంటికి రాకపోవడంతో సమీప బంధువులు ఆరా తీశారు. ఉదయం గ్రాసం కోసం వెళ్లినట్లు తెలియడంతో... ఆ తోట సమీపంలోకి వెళ్లి పరిశీలించారు. రక్తపుమడుగులో విగతజీవిగా పడి ఉండడంతో హతాశులయ్యారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పామూరు సీఐ ఎం.భీమానాయక్, ఎస్సై ఆర్.సుమన్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్ బృందంతో నిందితుల ఆచూకీ కోసం ప్రయత్నించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నమ్మకంగా మెలిగి రూ.2.50 కోట్లకు కుచ్చుటోపీ

మార్కాపురం, న్యూస్‌టుడే: చిరు దుకాణం నిర్వహిస్తున్న ఓ వ్యక్తి, అతడి కుటుంబీకులు నమ్మకంగా మెలుగుతూ... తెలిసిన వారందరి దగ్గరా అప్పులు చేసి బిచాణా ఎత్తేశారు. మార్కాపురం మండలం బొడిచెర్లలో ఆదివారం ఈ సంఘటన వెలుగు చూసింది. గ్రామీణ ఎస్సై అంకమ్మరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెలుగురి వెంకట సత్య వరప్రసాద్ స్థానికంగా చిరు దుకాణం నిర్వహిస్తున్నాడు. అక్కడకు వచ్చే వారితో పరిచయాలు పెంచుకుని అందరితో మంచిగా మెలిగేవాడు. ఆ క్రమంలోనే అవసరం ఉందంటూ వారి నుంచి పెద్ద మొత్తంలో అప్పులు చేశాడు. గ్రామస్థుల నుంచే కాకుండా భూపతిపల్లె, బొందలపాడు, తర్లుపాడు, మార్కాపురం పట్టణంలోని సుమారు 70 మంది నుంచి... రూ.2.50 కోట్లు తీసుకున్నాడు. ఆయన భార్య, తల్లి, అత్తమామలు, బావమరుదులు సైతం... ఒకరికి తెలియకుండా మరొకరు వ్యాపార అవసరాల పేరిట అప్పులు తీసుకున్నారు. ఎంతకీ బాకీలు తీర్చకపోవడంతో రుణదాతల నుంచి ఒత్తిడి పెరిగింది. ఆ క్రమంలోనే అంతా కలిసి గ్రామం వదిలి వెళ్లిపోయారు. ఈ మేరకు బాధితుడు కోలగట్ల చిన్నపురెడ్డి ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నకిలీలతో రియల్ దందా

▶ రూ.4 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా
▶ వైకాపా నేతతో అంటకాగిన నాటి రెవెన్యూ అధికారులు

వడ్డించేవాడు మనోడు అయితే.. అన్న చందంగా వైకాపా నాయకులు అధికారమే పెట్టుబడిగా గత అయిదేళ్లలో భూ ఆక్ర మణలకు పాల్పడ్డారు. నాటి జగన్ పాలనలో రెవెన్యూ అధికా రులు, సిబ్బంది వైకాపా నేతలతో అంటకాగి ప్రభుత్వ భూములకు నకిలీ పత్రాలు సృష్టించి అప్పనంగా ధారాదత్తం చేసేశారు. తిలా పాపం తలా పిడికెడు అన్నట్లు కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కట్టబెట్టేశారు. బినామీ పేర్లతో వశపరుచు కున్న ఆ భూముల్లో ప్లాట్లు వేసి అమాయక ప్రజలకు రూ.లక్షల్లో విక్రయిస్తున్నారు. సింగరాయకొండ మండలంలో వెలుగుచూ సిన భూదందా ఇది.

న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం



సింగరాయకొండ మండలం కనుమళ్ల గ్రామ పరిధిలోని ప్రధాన రహదారి వెంబడి 322 సర్వే నంబరులో సుమారు రూ.4 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఓ వైకాపా నేత, మరికొందరు నాలుగేళ్ల క్రితం అప్పటి రెవెన్యూ అధికారుల అండదండలతో బినామీ పేర్లతో నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమించారు. మండలకేంద్రం సింగరాయకొండ పరిధిలోని పారిశ్రామికవాడలో గతంలో కొందరు నిరుపేదలు తాత్కాలిక నివాసాలు నిర్మించుకుని జీవిస్తున్నారు. పారిశ్రామిక వాడ అధికారులు ఖాళీ చేయాలని ఆదేశించడంతో శాశ్వత నివేశన స్థలాలు మంజూరు చేయాలంటూ వారు అప్పటి రెవెన్యూ అధికారులను ఆశ్రయించడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 71 మందిని అర్హులుగా గుర్తించి కనుమళ్ల గ్రామ పరిధిలో పట్టాలు సిద్ధం చేశారు. ఈ పట్టాలపై కన్నేసిన వైకాపా నేతలు గత రెవెన్యూ అధికారులతో కలిసి అర్హులను జాబితాలో నుంచి తొలగించి అనర్హులను చేర్చి పట్టాలను వశపరచుకున్నారు. జాబితాలోని అర్హులు తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలంటూ రెవెన్యూ అధికారులను కోరినా మొండిచేయి చూపారు.



కనుమళ్లలోని ప్రభుత్వ భూమిలో నకిలీ పట్టాలతో నిర్మించిన తాత్కాలిక నివాసాలు

కేసు నమోదైనా అక్రమార్కులపై చర్యలు శూన్యం..

స్థానికేతరుల పేరుతో నకిలీ పట్టాలు సృష్టించడంతోపాటు, వైకాపా నేత అర్హులపై దాడికి పాల్పడి బెదిరించడం, కులం పేరుతో దూషించడంతో వారు సింగరాయకొండ పోలీసులను ఆశ్రయించడంతో అధికారులు విచారణ చేపట్టి అతడిపై గతంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అయినా పోలీసులు, రెవెన్యూ అధికారులు అతనిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. నేడు ఆ భూమి విలువ పెరగడంతో వైకాపా నేత, అతని అనుచరులు యథేచ్ఛగా ఇతరులకు అధిక ధరలకు ప్లాట్లు అమ్మేస్తూ జేబులు నింపుకొంటున్నారు. గత నెలలో స్థానిక వ్యక్తి ఒకరు జిల్లా కలెక్టరుకు మీకోసం కార్యక్రమంలో ఈ అక్రమ రియల్ వ్యాపారంపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు అక్రమార్కులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

స్థానికేతరులు, ప్రభుత్వ ఉద్యోగుల పేరుతో పట్టాలు..

నకిలీ పట్టాల మంజూరులో సుమారు 60 మంది స్థానికేతరులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉండడం గమనార్హం. కలికవాయ గ్రామ రైతు సేవ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగి, ఇద్దరు వీఆర్ఏలు, ముగ్గురు వీఆర్వోల కుటుంబ సభ్యుల పేర్లతో పట్టాలు నమోదయ్యాయి. నెల్లూరు జిల్లా కొండాపురం, వరికుంటపాడు, గుడ్లూరు, వలేటివారిపాలెం, కందుకూరు మండలాలకు చెందిన వారితోపాటు, సింగరాయకొండ మండలం బింగినపల్లి, పాతసింగరాయకొండ, శానంపూడి, పాకల, జిల్లా కేంద్రం ఒంగోలు తదితర ప్రాంతాలకు చెందిన బినామీ పేర్లే దర్శనమిస్తున్నాయి. దీనిపై తహసీల్దార్ రవిని వివరణ కోరగా.. తమకు జిల్లా కలెక్టరు కార్యాలయం నుంచి ఆదేశాలు అందితే చర్యలు తీసుకుంటామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐకాస సమన్వయకర్త జగన్నాథం మురళి

ఎస్సీ రిజర్వేషన్ల తీర్పును పునః సమీక్షించరూ!

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ వచ్చే నెల 18న గుంటూరులో నిర్వహించనున్న లక్ష మాల వినతుల మహాసభను జయప్రదం చేయాలని జిల్లా ఉద్యోగుల సంఘం ఐకాస సమన్వయకర్త జగన్నాథం మురళి కోరారు. స్థానిక దక్షిణ బైపాస్ వెంగముక్కపాలెం రోడ్డులోని ఓ హోటల్‌లో ఆదివారం జిల్లా దళిత, మాల సంఘాల ఐకాస సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయ కారణాలతో మరోసారి ఎస్సీ, ఎస్టీల మధ్య వివాదం సృష్టించేందుకు రిజర్వేషన్ల అంశాలను వాడుకుంటున్నారని విమర్శించారు. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలన్నారు. మహాసభలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ గళం వినిపించాలన్నారు. సమావేశంలో పలు సంఘాల నాయకులు చప్పిడి వెంగళరావు, దండేల కృష్ణ, ఎరిచర్ల సుబ్రహ్మణ్యం, చప్పిడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు డీఆర్‌యూసీసీ సభ్యుడిగా నరసింహం



మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణానికి చెందిన ఆర్.కె.జె.నరసింహం గుంటూరు డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డీఆర్‌యూసీసీ) సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయనకు గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ నుంచి అధికారికంగా ఉత్తర్వులందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ పథకం కింద మార్కాపురం రైల్వేస్టేషన్ కూడా ఎంపిక చేశారన్నారు. దీన్ని పర్యాటకంగా గుర్తిస్తూ కేంద్ర రైల్వేశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పటికే రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరయ్యాయని, పనులు జరుగుతున్నట్లు చెప్పారు. మార్కాపురం రైల్వేస్టేషన్ మీదుగా కొత్త రైళ్ల కోసం ప్రతిపాదనలు రైల్వేశాఖకు పంపించినట్లు చెప్పారు. విశాఖ- తిరుపతి వయా నంద్యాల మీదుగా, సికింద్రాబాద్- నంద్యాల వయా శావల్యాపురం, మాచర్ల నుంచి మార్కాపురం వరకు రైళ్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు కోరినట్లు చెప్పారు.

అసత్య ప్రచారాలపై ఫిర్యాదు చేస్తాం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: షిర్డీ సాయినాథునిపై చేస్తున్న అసత్య ఆరోపణలు, దుష్ప్రచారాలు భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయాలని జిల్లా సాయి మందిరాల సంఘం సభ్యులు తీర్మానించారు. ఈ మేరకు ఆదివారం సంతపేట సాయిబాబా మందిరంలో సమావేశం నిర్వహించారు. తమ పరిధిలోని మందిరాల్లో సేవా, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సాయిపై అసత్య ఆరోపణలు చేస్తే జిల్లావ్యాప్తంగా ఆందోళన చేపడతామని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రధాన కార్యదర్శి గోపాలుని హరిహరరావు, కోశాధికారి దేవకి సుబ్రహ్మణ్యం తెలిపారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు అలహరి చెంచలరావుతో పాటు జిల్లా నుంచి పలువురు సభ్యులు హాజరయ్యారు.



సంతపేట సాయి మందిరంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న జిల్లా సాయి మందిరాల సంఘం సభ్యులు

ఉపాధ్యాయుల కృషితో విశ్వగురుగా భారత్

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు కృషిచేస్తే భారతదేశం విశ్వగురుగా మారుతుందనడంలో సందేహం లేదని అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ గంత లక్ష్మణ్‌జీ అన్నారు. ఆదివారం స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ప్రాంత అభ్యాస వర్గ శిక్షణ (స్టేట్ ప్యానెల్ ట్రైనింగ్) నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు వై.వి.రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లక్ష్మణ్‌జీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు, వ్యవసాయం, గృహనిర్మాణం, ఆరోగ్యం వంటి రంగాల్లో అభివృద్ధి, అవసరాలకు అనుగుణంగా ప్రధాని నరేంద్రమోదీ జాతీయ విద్యావిధానాన్ని తీసుకొచ్చారన్నారు. మరిన్ని ఉద్యోగాలు సృష్టించడం, పేదరికాన్ని నిర్మూలించడం ప్రధాన లక్ష్యాలన్నారు. ప్రాచీన భారతీయ విజ్ఞానాన్ని, వారసత్వాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో క్విస్ విద్యాసంస్థల అధినేత నిడమానూరి కళ్యాణచక్రవర్తి, సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగనాథ్ మాట్లాడారు. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యశాలలో మాట్లాడుతున్న అఖిల భారతీయ రాష్ట్రీయ సౌక్షిక్ ముఖ్యవక్త గుంత లక్ష్మణ్‌జీ

అథ్లెటిక్స్‌లో గిద్దలూరు యువకుడి సత్తా

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆవరణలో ఈనెల 17 నుంచి 19 వరకు జరిగిన సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో గిద్దలూరుకు చెందిన విద్యార్థి మేరుగ వెంకట్ కాంస్య పతకం సాధించారు. వెంకట్ అండర్-20 బాలుర విభాగంలో 3000 మీటర్ల దూరాన్ని 9 నిమిషాల్లో పూర్తిచేసి తృతీయ స్థానంలో నిలిచారు. ఇండియన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వాహకులు ప్రశంసాపత్రంతో పాటు మెమొంటో అందజేశారు.



వెంకట్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

శీతల గిడ్డంగుల్లేక ఇక్కట్లు

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: ఏళ్లు గడుస్తున్నా నిమ్మ రైతుల కష్టాలు గట్టెక్కడం లేదు. ధర లేకపోవడం..ధర ఉన్నా నిల్వ చేసుకునే సదుపాయం లేకపోవడంతో వారు నిలువెల్లా కుంగిపోతున్నారు. సీజన్ అయినా అన్ సీజన్ అయినా నాలుగు డబ్బులు చూసే పరిస్థితి ఉండటం లేదని వారంటున్నారు. జిల్లాలో కనిగిరి ప్రాంతం నిమ్మ పంటలకు ప్రసిద్ధి. ఇక్కడి హనుమంతునిపాడు మండలం నుంచి పెద్దఎత్తున దిగుబడులొస్తుంటాయి. తోటల్లో కోతలు కోసి కనిగిరి ప్రాంతానికి పంపినా అక్కడ కోల్డ్ స్టోరేజీల సౌకర్యం లేకపోవడంతో వారికి దిక్కుతోచడం లేదు.



మార్కెట్ కమిటీల ద్వారా కొనుగోలు చేస్తేనే..

ఇటీవలకాలంలో నిమ్మ ధరలు భారీగా పడిపోయాయి. దీంతో ఇటు రైతులతో పాటు కమీషన్ వ్యాపారులు లబోదిబోమంటున్నారు. గత నెలలో కిలో రూ.80 పైన పలుకగా ఈ నెలలో ఒక్కసారిగా సగానికి సగం పడిపోయింది. నాణ్యతలేని కాయలకు కనీసం రూ.35 కూడా దక్కడం లేదని వారంటున్నారు. ఈ నేపథ్యంలో తోటల్లో కోతలు నిలిపివేశారు. కమీషన్ దుకాణాల్లో సరకు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. మండలం నుంచి కనిగిరి కమీషన్ మార్కెట్‌కు నిత్యం నాలుగు లారీల సరుకు చేరేది. ప్రస్తుతం ఒక్క లారీ రావడం గగనమైంది. దీనికి తోడు దక్షిణ భారతదేశంలోని నగరాలకు నెల్లూరు జిల్లా నుంచి సరుకు భారీగా వెళుతోంది. ఇదే పరిస్థితి ఉత్తర భారతదేశం కూడా నెలకొనడం వారిని కలవరానికి గురిచేస్తోంది. దీంతో పండించిన పంటను ఏం చేయాలో పాలుపోవడం లేదని వారంటున్నారు. మార్కెట్ కమిటీల ద్వారా కొనుగోలు చేసి రైతులకు ఊరట కల్పించి గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరుతున్నారు.

చీమకుర్తిలో జిల్లాస్థాయి చెకుముకి ప్రతిభ పరీక్ష

చీమకుర్తి, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లాస్థాయి చెకుముకి ప్రతిభ పరీక్ష ఈ నెల 27న చీమకుర్తి పబ్లిక్ పాఠశాలలో జరగనుందని సంస్థ గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.జవహర్ తెలిపారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో పరీక్షలకు సంబంధించి గోడపత్రాలను ఆవిష్కరించారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ, శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించేతత్వం పెంపొందించే దిశగా ఈ సైన్సు సంబరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంఘం నాయకులు నల్లూరి వెంకటేశ్వరరావు, పి.స్వరూప రెడ్డి, యు.భాస్కర్, వి.మాలకొండారెడ్డి, సీహెచ్.జయప్రకాష్, చలువాది రమేష్, షేక్ ఖాజా హుస్సేన్, బి.దేవ ప్రసాద్, ఐజాక్ బాబు, రంగారెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాలి రామలింగ శర్మ జయంతిని పురస్కరించుకొని రెజ్లింగ్ క్రీడాకారులకు కల్యాణ్‌కిరణ్ దుస్తులు అందజేశారు.



గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

మధ్యంతర భృతి ప్రకటించాలి

పామూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించి రావాల్సిన డీఏ బకాయిలు, మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అరియారం సురేష్ డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆ శాఖ సబ్ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఎఫ్ఎల్ఎన్ శిక్షణను ఉపాధ్యాయులకు సౌకర్యంగా మండల కేంద్రాల్లో నిర్వహించాలని చెప్పారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల ఖాళీలను పదోన్నతుల ద్వారా త్వరితగతిన భర్తీ చేయాలని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరిలో కాకినాడలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు జె.వెంకటరావు, షేక్ పాదుషా, జి.వేమనారాయణ, జి.శ్రీనివాసులురాజు, జి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్

వర్షపు నీటిలోనే మెకానిక్ షెడ్లు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: వర్షాల అనంతరం గుంటూరు రోడ్డులోని తెదేపా కార్యాలయం ఎదుట గల మెకానిక్ షెడ్ల నిర్వాహకులకు సమస్య తలెత్తింది. మురుగు కాలువ వ్యవస్థ సక్రమంగా లేక వర్షపు నీరు నిలిచి అక్కడి వచ్చే వినియోగదారులు, వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు మెకానిక్‌లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కమిషనర్ కె.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని వారిని కోరారు.

మహిళలకు ఉచిత బస్సుపై పోస్టుకార్డు ఉద్యమం

▶ డీసీసీ అధ్యక్షుడు సైదా

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీ అమలు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టినట్లు డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా తెలిపారు. సోమవారం నుంచి 23వ తేదీ వరకు నియోజకవర్గ పార్టీ బాధ్యుల ఆధ్వర్యంలో దీన్ని చేపడుతున్నామన్నారు. బస్టాండ్లలో మహిళలతో పాటు పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించిన వారి చేత పోస్టు కార్డులు రాయించి నిరసన తెలపాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా దీనిపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం దారుణమని ఆయన ఓ ప్రకటనలో విమర్శించారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన గిద్దలూరు మండలం ఉయ్యాలవాడ పంచాయతీ అంకణంపల్లెలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకణంపల్లెకి చెందిన రాచగొర్ల పిచ్చయ్య కుమారుడు నాగార్జున (23) ఆదివారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లారు. అక్కడి డీప్‌బోరు వద్ద బల్బు పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై కుప్పకూలి ప్రాణాలు విడిచారు. స్థానికులు గమనించి వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. జరిగిన సంఘటనపై బాధితుని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు దిగుతూ జారిపడి..

నాగులుప్పలపాడు : రైలు దిగుతూ జారిపడి మహిళకు గాయాలైన సంఘటన ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్‌లో ఆదివారం చోటుచేసుకొంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు...బాపట్ల జిల్లా చినగంజాం మండలం పెదగంజాం గ్రామానికి చెందిన బి.వెంకటేశ్వరమ్మ ఆదివారం బంధువులతో కలసి వల్లూరమ్మ దేవస్థానానికి మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్లారు. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి రైలులో బయలుదేరారు. ఆ క్రమంలో ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతూ జారి పడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. ఆమెను 108 వాహనంలో ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

మాయమాటలు చెప్పి.. గర్భిణిని చేసి..

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఓ యువతికి మాయమాటలు చెప్పి గర్భిణిని చేసిన ప్రబుద్ధుడిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన ఆదివారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..గుంటూరు జిల్లా పెదనందిపాడుకి చెందిన షేక్ రసూల్ బాషా 2023లో కొత్తకోట గ్రామానికి వచ్చి స్థానికంగా ఉన్న ఓ యువతికి మాయమాటలు చెప్పాడు. తాను పోలీసు ఉద్యోగం చేస్తున్నానని చెప్పి ఆమెను లోబరుచుకున్నాడు. ఆమె ఓ బిడ్డకు జన్మనిచ్చాక తప్పించుకుని తిరుగుతున్నాడు. దీనిపై బాధితురాలు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

బాలికను వేధించిన వారిపై పోక్సో కేసు

మద్దిపాడు, న్యూస్‌టుడే: పదమూడేళ్ల బాలికను వేధిస్తున్న యువకులపై పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓ విద్యార్థిని చరవాణికి ఇనమెనమెళ్లూరుకు చెందిన తోట హరీష్, పల్లపోతు యశ్వంత్ సందేశాలు పంపుతూ వేధిస్తున్నారు. దీనిపై బాధితురాలి తల్లి మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితులపై పోలీసులు ఫోక్సో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు


మార్కాపురం, న్యూస్‌టుడే: చోరీ కేసుల్లో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మార్కాపురం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలో పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా భగత్‌సింగ్ కాలనీ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. వారు విచారణ చేపట్టి ఏడో వార్డులోని వడ్డెబజారుకు చెందిన కొండేటి ఇంద్ర పవన్‌కుమార్‌గా గుర్తించారు. ఇంటర్ చదువును మధ్యలోనే మానేసి జల్సాలకు అలవాటు పడి చోరీలు చేస్తున్నట్లు నిందితుడు అంగీకరించాడు. ఇప్పటికే కొమరోలు మండలంలోని ఇతనిపై రెండు దొంగతనం కేసులు నమోదయ్యాయి. మార్కాపురం పట్టణంలో ఈ నెల 12, 14వ తేదీల్లో భగత్‌సింగ్‌కాలనీలో రెండు నివాసాల్లో చోరీలు చేశాడు. దీంతో పవన్‌కుమార్‌పై కేసు నమోదు చేసి మార్కాపురం కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. నిందితుడిపై 14 రోజుల రిమాండ్ విధించినట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు.

మూడు గ్రామాల్లో ..: దర్శి (తాళ్లూరు): దర్శి మండలంలోని విద్యుత్తు పరివర్తకాల్లో సామగ్రి చోరీకి గురైన ఘటనలపై ఆదివారం రాత్రి దర్శి పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం రామచంద్రాపురం, గణేశునిపురం, పాపిరెడ్డిపాలెం పొలాల్లో ఏర్పాటుచేసిన విద్యుత్తు పరివర్తకాల్లోని సామగ్రిని దొంగలు చోరీ చేశారు. దీనిపై ఏఈ వేణుగోపాల్ ఫిర్యాదుమేరకు ఎస్సై మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 130, రిటైల్ లైవ్ - 152, చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్- 251

బలిజలకు ప్రాధాన్యమివ్వాలని వినతి

కంభం, న్యూస్‌టుడే : కాపు, బలిజ, తెలగ సామాజిక వర్గాల వారికి నామినేటెడ్ పోస్టుల భర్తీలో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ కంభానికి చెందిన న్యాయవాది చెన్ను శివప్రసాద్ మంగళగిరిలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. కూటమి అధికారంలోకి వచ్చేందుకు ఆ సామాజిక వర్గాల వారు ఎంతో కృషి చేశారని చెప్పారు. ఆయన వెంట గూడూరుశెట్టి దొరబాబు, తదితరులు ఉన్నారు.


తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న శివప్రసాద్

మార్కాపురం

•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

విజేతలకు బహుమతుల పంపిణీ

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే : మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు మండలాల పరిధిలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన వారికి ఆదివారం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆవోపా సభ్యులు బహుమతులు అందజేశారు.


బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఆవోపా సభ్యులు


పుల్లలచెరువు : ముటుకులలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎరిక్షన్‌బాబు


బేస్తవారపేటలో సీసీ రహదారి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గ్రామాభివృద్ధే ప్రధాన లక్ష్యం

త్రిపురాంతకం, పుల్లలచెరువు, బేస్తవారపేట : గ్రామాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నామని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా త్రిపురాంతకం మండలంలోని నడిగడ్డ, దూపాడు, గొల్లపల్లి, విశ్వనాధపురం, సోమేపల్లి, రాజుపాలెం, త్రిపురాంతకంలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ❖పుల్లలచెరువు మండలంలోని ముటుకుల, మర్రివేములలో నిర్మిస్తున్న సి.సి రోడ్లకు శంకుస్థాపన చేశారు. ❖ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బేస్తవారపేట పంచాయతీ పరిధిలో రూ.93 లక్షలతో ప్రారంభించనున్న అంతర్గత సీసీ రహదారులకు మండల పరిషత్తు కార్యాలయం వద్ద గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సోరెడ్డి మోహన్‌రెడ్డి, ఆశ్రిత జ్యోతి, తెదేపా, జనసేన, భాజపా నాయకులు పాల్గొన్నారు.

ముంచిన వాన

❖ పొలాల్లో నీరు ❖ మిర్చి పంటకు నష్టం


వై.పాలెం వర్షం నీటిలోనే మిరప పంట

యర్రగొండపాలెం, త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎడతెరిపిలేని వర్షాలతో అన్నదాతలు కుదేలవుతున్నారు. రెండు వారాలుగా కురుస్తున్న జల్లులకు పంటలన్నీ ఉరకలెత్తుతూ తెగుళ్ల గుప్పిట చిక్కాయి. పురుగు మందులు కొట్టేందుకూ వరుణుడు సమయమివ్వకపోవడంతో మిర్చి, పత్తి, కంది, జొన్న తదితర పంటలపై వైరస్ తెగుళ్లు విజృంభిస్తున్నాయి. వీద ఎక్కువైన మిరప మొక్కలను తొలగిస్తున్నారు. పొగాకు తోటలన్నీ ఎర్రగా మారి బొంత కూగా మారి నాణ్యత, దిగుబడి తగ్గుతోందని అన్నదాతలు విలపిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం మరింత నష్టం చేకూర్చుతుందని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలని కోరుతున్నారు.

❖ ఉరకెత్తాయి... : త్రిపురాంతకం మండలంలో 9వేల ఎకరాల్లో మిర్చి, 400 ఎకరాల్లో పొగాకుతో పాటు మొక్కజొన్న, వరి, కంది సాగు చేశారు. వర్షాలకు రామసముద్రం రేగడి నేలల్లో సాగు చేసిన పొగాకు ఉరకెత్తి ఎర్రగా ఎండిపోతోంది. లేళ్లపల్లి, చెర్లోపల్లిలో కొట్టుడుకు వచ్చిన పొగాకు తడవడంతో రంగు మారింది. సాగర్ ఆయకట్టులోని గ్రామాలతో పాటు మెట్ట ప్రాంతంలోని లోతట్టు భూముల్లో సాగు చేసిన మిర్చి ఉరకెత్తింది. పూత, కాపు దశలోని పంట ఒడిపోతోంది. మేడపి, గణపవరం, అన్నసముద్రం తదితర చోట్ల ఇటీవల నాటిన మొక్కజొన్న మొలకెత్తే దశలో ఉండగా వాన నీటికి చాలా పొలాల్లో మొలవ లేదు. అరకొర వచ్చిన మొక్కలు వర్షపు నీరు నిల్వ చేరడంతో ఎండిపోతున్నాయి. రామసముద్రం, మిట్టపాలెం తదితర చోట్ల సాగులోని కంది ఉరకెత్తి ఎండిపోతుంది. అన్నసముద్రం పొలాల్లో వేసిన వరి నాట్లు చెరువు నీరు ప్రవహిస్తుండటంతో మునిగిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


వై.పాలెం : తెగులు సోకిన మొక్కలను పీకి గట్టున వేస్తున్న రైతు వెంకటస్వామి

ఉంటుందో.. పోతుందో



రేగడి పొలంలో మూడున్నర ఎకరాల్లో మిర్చి వేశాను. ఇప్పటికే దాదాపు రూ.2లక్షలు పెట్టుబడి పెట్టాను. పూత, కాపు దశలో ఉండగా వర్షం ధాటికి నీరు చేరడంతో కొంత పంట ఉరకెత్తింది. మిగతా పంట కూడా ఉంటుందో పోతుందో తెలియదు.

–సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, రైతు, రామసముద్రం, త్రిపురాంతకం మండలం

ఇలాగైతే.. రాకపోకలు ఎలా?

మార్కాపురం, న్యూస్‌టుడే:

మార్కాపురం మండలంలోని నికరంపల్లి, పెద్దనాగులవరం గ్రామస్థులు నిత్యం పొలాలకు వెళ్లే రహదారులు వర్షానికి బురదమయంగా మారింది. నికరంపల్లి గ్రామంలో సుమారు 500 మంది రైతులు పొలాలకు వెళ్లడానికి ఈ ఒక్క రహదారే కీలకం. పెద్దనాగులవరంలోని 600 మంది రైతులకు ఇదే రహదారి దిక్కు. ద్విచక్ర వాహనాలు, ఎద్దుల బండ్లు, పోలానికి వెళ్లే రైతులు, పొలం పనులకు వెళ్లే కూలీలు నిత్యం రాకపోకలు సాగించే ఈ రహదారి వర్షానికి దెబ్బతినడంతో నడవడానికి ఇబ్బంది ఉంది. మెటల్ రోడ్డు కోసం పదేళ్లుగా ఈ రెండు గ్రామాల వారు పోరాడుతున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ కూటమి ప్రభుత్వంలోనైనా రెండు గ్రామాల మధ్య మెట్ రహదారిని నిర్మాణం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


వాగులా మారిన రహదారిలో వెళ్తున్న రైతు


బురదతో కష్టంగా పొలాలకు చేరుకుంటున్న మహిళలు


వై.పాలెంలో రహదారి దుస్థితి ఇదీ..

యర్రగొండపాలెంలో ఆదివారం సాయంత్రం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పట్టణంలోని పలు వీధుల్లో రహదారులు జలమయంగా మారాయి. పట్టణంలో పలు రోడ్లు జలమయంగా మారాయి. వినుకొండ రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద నుంచి అపార్టుమెంట్‌కు వెళ్లే రహదారి, శివాలయం రహదారి, వస్తాద్ బజారు, పాత రిజిస్ట్రార్ కార్యాలయం బజారు తదితర రోడ్లలో నీరు నిలిచి పాదచారులకు ఇబ్బంది మారింది.

– న్యూస్‌టుడే, యర్రగొండపాలెం పట్టణం

వీధులా.. చెరువులా..!

త్రిపురాంతకం : మండలంలోని గొల్లపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వెనుక వైపు ఉన్న యాదవ బజారులో చిన్నపాటి వర్షం కురిసినా నీరు వెళ్లేలేని పరిస్థితి నెలకొంది. కాలనీలోని రహదారి పూర్తిగా మునిగి మోకాళ్ల లోతు వరకు నీరు నిలబడి ఉంటోంది. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పాటు ఆదివారం కురిసిన వర్షానికి ఆ ప్రాంతం మొత్తం చెరువులా మారిపోయింది. దీంతో వృద్ధులు, చిన్నారులతో పాటు ఆ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందు పడ్డారు.


గొల్లపల్లిలో రహదారిపై నిలిచిన నీరు

సమస్యకు పరిష్కారం చూపాలి



చిన్నపాటి వర్షం కురిసినా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కనీసం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– నరేష్, గొల్లపల్లి, త్రిపురాంతకం మండలం



మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణంలోని నాగులవరం వెళ్లే రోడ్డులోని రాజ్యలక్ష్మీ కాలనీలో ఇప్పటికీ పూర్తి స్థాయిలో సీసీరోడ్లు లేవు. వర్షాకాలం వచ్చిందంటే బురదలో నడవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కాలనీ ఏర్పడి 20సంవత్సరాలైనా ఇక్కడ పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటు చేయలేదు.

– పి.వెంకటేశ్వర్లు, కాలనీవాసి

సమధానం: ప్రస్తుతం నిధుల కొరత కారణంగా సీసీరోడ్లు, డ్రైనేజీలు వంటి పనులు చేపట్టడం లేదు. గతంలో ఎలక్ట్రికల్ బల్బుల బిల్లులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని చెల్లించిన తరువాత 15వ ఆర్థికసంఘ నిధులు మంజూరైతే సీసీ రోడ్లు వేసే అవకాశం ఉంది.

– డీవీఎస్.నారాయణరావు, మున్సిపల్ కమిషనర్

దేవాలయ దస్త్రాల పరిశీలన

ఈనాడు కథనానికి స్పందన

గిద్దలూరు పట్టణం : గిద్దలూరులోని పట్టాభిరామస్వామి, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీభద్రకాళి, వెంకటేశ్వరస్వామి, రామభజన మందిరాలను ఆదివారం గిద్దలూరు తహసీల్దారు ఆంజనేయరెడ్డి సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం గిద్దలూరు వాసులకు తిప్పలు తెచ్చి పెట్టిన వైనంపై 'ఈనాడు'లో ఆదివారం 'నీవైనా చెప్పు ఆంజనేయా' శీర్షికన కథనం వెలువడటంతో జిల్లా రెవిన్యూ అధికారులు నివేదిక అందజేయాలని తహసీల్దారుకు ఆదేశించారు. దీంతో తహసీల్దారు కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. గిద్దలూరు రెవెన్యూ సర్వే నంబరు 435/1లో ఉన్న 5 దేవస్థానాల భూముల విస్తీర్ణాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు.

**ఉచిత కంటి వైద్యశిబిరం : ** యర్రగొండపాలెం పట్టణం : స్థానిక షాదీఖానాలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 25 మందికి చికిత్స కోసం సిపార్సు చేశారు.

**కూలిన రేకులషెడ్డు : ** పొదిలి గ్రామీణం : వర్షాలకు మండలంలోని మూగచింతల గ్రామంలో బత్తుల వెంకట్రావుకి చెందిన రేకుషెడ్డు కుప్పకూలింది.

వీడని ముసురుతో ఇక్కట్లు

❖ కంపుకొడుతున్న పట్టణం ❖ పల్లెల్లో దుర్గంధం


మార్కాపురం పట్టణంలో కురుస్తున్న వర్షం

మార్కాపురం, మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మార్కాపురం పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల రహదారులు అధ్వానంగా మారాయి. వర్షాలకు పట్టణంలోని పలు ప్రాంతాలు కంపుకొడుతున్నాయి. పట్టణ ప్రధాన రహదారుల్లో మురుగు పేరుకుపోయింది. పూలసుబ్బయ్యకాలనీ, డ్రైవర్స్‌కాలనీ, ఏకలవ్యనగర్, నానాజాతుల కాలనీ, రాజ్యలక్ష్మీనగర్, సుందరయ్యకాలనీ, భగత్‌సింగ్‌కాలనీ, జవహర్‌నగర్‌కాలనీ, విద్యానగర్ శివారు, , కొండేపల్లి గ్రామానికి వెళ్లు ప్రాంతం, దొడ్డవారి వీధి ఇలా అన్ని కాలనీలు వర్షానికి దుర్గంధం వెదజల్లుతున్నాయి. మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. దోమలు పెరిగి రాత్రి, పగలు అనే తేడా లేకుండా కుడుతున్నాయి. మండలంలోని నికరంపల్లి, పెద్దనాగులవరం, చింతకుంట, జమ్మనపల్లె, కోలభీమునిపాడు, కె.కొత్తపల్లె, తిప్పాయపాలెం, రామచంద్రాపురం, కొండేపల్లి, మాల్యవంతునిపాడు, వేములకోట, బొడపాడు, బొందలపాడు, భూపతిపల్లె, గోగులదిన్నె, గజ్జలకొండ, రాయవరం, ఇడుపూరు, దరిమడుగు వర్షాలకు అధ్వానంగా మారాయి. తక్షణమే అధికారులు, బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ చేయడం వంటి పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక చేయూత

పొదిలి గ్రామీణం : కాటూరివారిపాలెం చెందిన మన్నం పద్మ ఇటీవల ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం మంచానికే పరిమితమయ్యారు. దీంతో వీటి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులో పడింది. పద్మ కుమార్తె స్ఫూర్తి పొదిలి పట్టణంలోని వీరిశెట్టి కళాశాలలో ఇంటర్ చదువుతోంది. విద్యార్థిని కుటుంబ పరిస్థితి తెలుసుకున్న కళాశాల యాజమాన్యం ఆదివారం కళాశాల తరపున పదివేల రూపాయలు ఆర్థిక సాయాన్ని ఆ కుటుంబానికి అందించింది.

నిత్యావసర సరకుల అందజేత

కంభం : పట్టణానికి చెందిన దివ్యాంగురాలి భాను బి.బేగం కుటుంబానికి నూర్‌బాషా సంఘం అధ్యక్షుడు డి.ఖాదర్‌వలి (చమన్) రెండు నెలలకు అవసరమైన నిత్యావసర సరకులను ఆదివారం అందజేశారు.

సాగర్ నీరు వృథా

పొదిలి గ్రామీణం : కుంచేపల్లి వద్ద పైపు లీకు కావడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో దర్శి నుంచి పొదిలికి నీటి సరఫరా సక్రమంగా కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా నీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పైపులకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కుంచేపల్లి వద్ద లీకవుతున్న నీరు

దీపావళి టపాసులు సీజ్

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పెద్దదోర్నాల లోని ఫ్యాన్సీ దుకాణాన్ని ఎస్సై మహేష్ శనివారం రాత్రి తనిఖీ చేశారు. దుకాణంలో దీపావళి టపాసులను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. అనుమతులు లేకుండా టపాసులు ఉన్నా, అమ్మినా వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు

పెద్దదోర్నాల : రహదారి ప్రమాదంలో మృతి చెందిన స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ దూదేకుల మహబూబ్ సుభాని మృతదేహానికి ఆదివారం ఆయన స్వగ్రామం చిన్నగుడిపాడులో పోలీసుల లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సీఐ ప్రభాకర్‌రావు, ఎస్సై మహేష్‌లు సుభాని కుటుంబసభ్యులను పరామర్శించారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

త్రిపురాంతకం, పెద్దదోర్నాల, యర్రగొండపాలెం పట్టణం : పల్లెల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే అటువంటివారిపై కఠిన చర్యలు తప్పవని త్రిపురాంతకం సీఐ అస్సాన్ హెచ్చరించారు. త్రిపురాంతకం సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి నుంచి స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ❖ పెద్దదోర్నాల పోలీసు స్టేషన్‌లో సీఐ ప్రభాకర్‌రావు రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. దొంగతనాలు, నేరాలు వదిలేసి ప్రశాంత వాతావరణంలో జీవించాలని సూచించారు. ❖ యర్రగొండపాలెం మండలంలోని గురిజేపల్లెలో ఆదివారం సీఐ ప్రభాకరరావు, ఎస్సై చౌడయ్యల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో చెడ్డి గ్యాంగ్ కదలికలు ఉన్న నేపథ్యంలో ఇంటింటి తిరిగారు. పత్రాలు లేని 14 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. చోరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.


వై.పాలెంలో ద్విచక్రవాహనాలు స్వాధీనం చేస్తుకున్న సీఐ, ఎస్సైలు ప్రభాకరరావు, చౌడయ్యలు

జాతీయ ప్రతిభా పురస్కారం

కంభం, పెద్దదోర్నాల : కంభం పట్టణానికి చెందిన ఎంజీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ అబ్దుల్ గఫార్ అలీఖాన్‌కు, పెద్దదోర్నాల హర్ష ఇండియన్ ఉన్నత పాఠశాల డైరెక్టర్ ఎం.మల్లికార్జునరావుకు సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్ ఆర్గనైజేషన్ వారు అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారం అందించారు. గుంటూరులో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆ సంస్థ గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నసీర్, ఆ సంస్థ అధ్యక్షుడు నాగయ్య చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.



ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అబ్దుల్ గఫార్ అలీఖాన్. మల్లికార్జునరావు,

ఘనంగా పోలేరమ్మ వేడుకలు

మార్కాపురం పట్టణం, కంభం : తర్లుపాడు రోడ్డులోని అల్లూరి పోలేరమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ❖కంభం పట్టణ సమీపంలోని కోటా సత్యమాంబదేవికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, చందనం, పుష్పాలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుంతలమయంగా... రహదారులు

❖ తారు లేచి.. కంకర తేలి

బేస్తవారపేట, న్యూస్‌టుడే :

వర్షాలకు మండలంలోని రహదారులు అధ్వానంగా మారాయి. గత పాలకులు అయిదేళ్లుగా వీటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో వీటి రూపురేఖలే మారిపోయాయి. రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఒంగోలు-గిద్దలూరు జాతీయ రహదారి కొన్నేళ్లుగా మరమ్మతుకు నోచుకోలేదు. తారు లేచి, రాళ్లు తేలి గోతులు ఏర్పడ్డాయి. పీతిరి వాగు వద్ద గుంతలకు తూతూమంత్రంగా మరమ్మతులు చేసినా ప్రస్తుత వర్షానికి మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది. వాహనచోదకులు ఈ మార్గంలో వెళ్లేందుకు జంకుతున్నారు.

ఏళ్లుగా నిర్వహణకు నోచుకోక.. : బేస్తవారపేట-చిన్నకంభం వెళ్లే దారి తారు లేచిపోయి కంకర తేలి అధ్వానంగా మారింది. ఏళ్లుగా నిర్వహణ లేకపోవడంతో సుమారు 1.6 కిలోమీటర్ల మేర ఈ రహదారిలో అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడ్డాయి. రహదారి అంచులు సైతం ధ్వంసమయ్యాయి. కోనపల్లి అడ్డరోడ్డు నుంచి మండలంలోని కొత్తపేట వరకు సుమారు 14


అధ్వానంగా మారిన ఒంగోలు-గిద్దలూరు రహదారి

❖ ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు

కిలోమీటర్ల మేర రహదారికి ఇరువైపులా అంచులు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. అంచుల వెంబడి తారు లేచిపోయి రాళ్లుతేలి గుంతలమయంగా మారడంతో ఏమాత్రం అశ్రద్ధగా ప్రయాణించిన భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు చేపడతాం...

అర్జంట్ రిపేర్స్, యూఆర్ కింద సుమార్ రూ. 44 లక్షలు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ కొనసాగుతుంది త్వరలో పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. ఒంగోలు-గిద్దలూరు జాతీయ రహదారి మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరుకాగానే పనులు మొదలు పెడతాం.

– ఆర్‌అండ్‌బీ ఏఈ కొత్త వెంకటేశ్వరరెడ్డి, కంభం ఆర్‌అండ్‌బీ డీఈ నరసింహులు

కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి



సి.ఎస్.పురం, న్యూస్‌టుడే:

సమస్య: సి.ఎస్.పురంలోని పామూరు, డీజీపేట రహదారులు గుంతలతో అధ్వానంగా ఉన్నాయి. కొద్దిపాటి జల్లులు పడినా గోతుల్లో వర్షపు నీరు నిలుస్తోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సి.ఎస్.పురంలోని పామూరు, డీజీపేట రహదారులను సింగరాయకొండ-మైదుకూరు జాతీయ రహదారుల బైపాస్ రోడ్డు వరకు రెండు వరుసలుగా అభివృద్ధి చేయాలి. -కల్లు రమణారావు, ఆర్ఎంపీ, సి.ఎస్.పురం

సమాధానం: ఈ రహదారులను కొన్ని చోట్ల మర మ్మతులు చేయించాం. అయినా వర్షపు నీరు నిలుస్తుం డడంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. వర్షాలు తగ్గిన తర్వాత మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసు కుంటాం. -ఎస్.సుమన్, ఎన్‌హెచ్ ఏఈఈ

కురిచేడు, న్యూస్‌టుడే:

సమస్య: గంగదొనకొండలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో శిథిలావస్థకు చేరిన మంచినీటి ట్యాంకు ఉంది. అధిక వర్షాలు కురిసిన ఆ ట్యాంకు పడిపోతే వృథాగా ఉంటుంది. ప్రస్తుతం ఇనుప చువ్వలు బయటపడి పడిపోయేలా ఉంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటున్నారు. ఏటువంటి ప్రమాదం జరగక ముందే శిథిల ట్యాంకును తొలగించాలి. – వెంకటేష్, స్థానికుడు

సమాధానం: వెంటనే ట్యాంకు పరిస్థితిని పరిశీలించి, ఉన్నతాధికారులకు తెలియజేసి తొలగించేందుకు చర్యలు చేపడతాం. – కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, గంగదొనకొండ

మర్రిపూడి, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని జువ్విగుంట ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగక రాత్రిపూట ఇబ్బందిగా ఉంటుంది. -బాబూరావు, కాలనీవాసి

సమాధానం: విద్యుత్తు మెకానిక్‌తో మాట్లాడి వెంటనే వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. -హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే:

సమస్య: మండల కేంద్రం హెచ్ఎంపాడులో వీధి కుళ్లాల బెడద ఎక్కువగా ఉంది. – ఏ.కేశవరావు, గ్రామస్థుడు

సమాధానం: సర్పంచి, కార్యదర్శికి సూచనలిచ్చి వీధి కుళ్లాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. -ఎం.రంగసుబ్బారాయుడు, ఎంపీడీవో

పీసీపల్లి, న్యూస్‌టుడే

సమస్య: మండల కేంద్రం పీసీపల్లిలో వీధి దీపాలు లేక రాత్రిపూట ఇబ్బందులు పడుతున్నాం. -స్థానికులు

సమాధానం : పంచాయతీ కార్యదర్శితో చర్చించి కొత్త దీపాలు వేసేందుకు చర్యలు తీసుకుంటాం. -ప్రభాకరశర్మ ఇన్‌ఛార్జి ఎంపీడీవో

22, 23 తేదీల్లో ప్రజా దర్బార్

పామూరు: పామూరు మండల పరిషత్తు కార్యాలయంలో ఈ నెల 22 ఉదయం 9 గంటలకు, సి.ఎస్.పురం మండల పరిషత్తు కార్యాలయంలో 23వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవోలు బి.సురేష్, షేక్ ఖాదర్‌బి తెలిపారు. ఈ సమావేశాలకు అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరవుతారని చెప్పారు.

నేడు రేగులచెలకలో భూముల సర్వే

సి.ఎస్.పురం: మండలంలోని రేగులచెలక లోని 224 సర్వే నంబరులోని భూములకు సంబంధించి హక్కుదారుల గుర్తింపునకు సర్వే జరుగుతుందని తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి తెలిపారు. సదరు సర్వే నంబరుకు సంబంధించిన రైతులు సోమవారం నుంచి వారం రోజుల లోపల వారి భూమి మీద గట్టు చూపిస్తూ భూమి హక్కుకు సంబంధించిన యాజమాన్య పత్రాలు అందజేయాలని సూచించారు.

ఇరుకు రోడ్లు.. ట్రాఫిక్ ఇక్కట్లు

• వ్యాపార కేంద్రం పామూరులో తప్పని అవస్థలు

న్యూస్‌టుడే, పామూరు

వ్యాపార కేంద్రంతోపాటు జిల్లాలోనే అతిపెద్ద మేజర్ పంచాయతీ పామూరు. ఇక్కడి జనాభా సుమారు 30 వేల మంది. అయినా ఇరుకు రోడ్లతోనే కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి. వ్యాపార కేంద్రం కావడంతో నెల్లూరు జిల్లా ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి, పామూరు, సి.ఎస్.పురం మండలాల నుంచి నిత్యం వేల సంఖ్యలో ప్రజలు వివిధ పనులపై రాకపోకలు సాగిస్తుంటారు.



ప్రధాన రహదారిలో రద్దీ (పాత చిత్రం)

దీనికితోడు 20 వరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నాయి. నిత్యం సమీప మండలాల నుంచి పాఠశాల బస్సులు, ఆటోలు, ఆర్టీసీ బస్సుల్లో వేల మంది విద్యార్థులు వస్తుంటారు. పదుల సంఖ్యలో వస్త్ర, ఫ్యాన్సీ, పుస్తకాలు, మందులు, కిరాణా హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. సమీప మండలాల్లోని గ్రామాల నుంచి చిరు వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. 50 బంగారు, నగల దుకాణాలు, రెండు సినిమా థియేటర్లు ఉన్నాయి. ఉదయం వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, పాఠశాలలు, కళాశాలలకు వచ్చే సమయంలో, సాయంత్రం తిరిగి వెళ్లేటప్పుడు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పండగల సీజన్‌లో ప్రధాన రహదారులు కొనుగోలుదార్లతో రద్దీగా ఉంటాయి. ఉన్నతాధికారులు స్పందించి పామూరులో రహదారులను విస్తరించాలని, పోలీసులు ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పామూరులోని సి.ఎస్.పురం రోడ్డులో వాహనాలు ఇలా..

వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు..

పామూరులోని సి.ఎస్.పురం బస్టాండ్, మార్కెట్ కూడలి, ప్రధాన రహదారి, కందుకూరు కూడలి, నెల్లూరు రహదారిలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటోంది. పెరిగిన వాహనాల రద్దీతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యపై పలుమార్లు జిల్లా కలెక్టర్‌తోపాటు, ఇతర ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేసి గ్రామస్థులు సమస్యను విన్నవించారు. అయినా ఫలితం లేకపోయింది. పామూరులో రహదారులు వెడల్పు తక్కువగా ఉన్నాయి. కొందరు మురుగు కాలువలను ఆక్రమించడం వల్ల సమస్య మరింత జటిలమైంది. రోడ్లపై లారీలు వంటి భారీ వాహనాలను సైతం నిలిపి సరకులు, ఇతర వస్తువులను దించుతుండడంతో ఇబ్బందిగా ఉంటుంది. రహదారుల విస్తరణ చేపడితే తప్ప ట్రాఫిక్ సమస్య తీరదని ప్రజలు చెబుతున్నారు.

వాహనాల రద్దీ పెరిగింది..



పామూరులో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నాం. రహదారులపై, దుకాణాల ముందు వాహనాలను నిలుపుతున్నారు. దీంతో రద్దీ పెరిగింది. దీనికి తగ్గట్లు రహదారులు లేవు. రోడ్ల విస్తరణ చేయాలి. –పజ్జాల సుబ్బారావు, వ్యాపారి, పామూరు

ప్రత్యేక చొరవ తీసుకోవాలి..



పామూరులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండడంతో అవస్థలు పడుతున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ వల్ల చోదకులు, పాదచారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ట్రాఫిక్ నియంత్రణకు అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలి. జనాభా పెరగడం, పలు మండలాలకు దగ్గరగా ఉండడం, వ్యాపార కేంద్రం కావడంతో వాహనాల సంఖ్య పెరిగిపోతోంది. పాలకులు, అధికారులు రహదారుల విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. –కేదూరి ప్రభాకర్‌రావు, ఆటో చోదకుడు

నియంత్రణకు చర్యలు తీసుకుంటాం



పామూరులో ప్రస్తుతం వాహనాల సంఖ్య, జనసంచారం బాగా పెరిగింది. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు సిబ్బందిని నియమిస్తున్నాం. అయినా వాహనాల రద్దీ ఉంటోంది. రహదారులపై వాహనాలు అడ్డంగా పెట్టకూడదు. రహదారులను విస్తరిస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుంది. వ్యాపారులు, వాహనదారులకు అవగాహన కల్పించి ట్రాఫిక్ సమస్య నివారణకు తగు చర్యలు తీసుకుంటాం. –ఎం.భీమానాయక్, సీఐ, పామూరు

మట్టి తీస్తేనే నీరు కదిలేది



తూర్పు నాయుడుపాలెంలో కాలువను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై గల వంతెన కింద కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు తూర్పు నాయుడుపాలెం, పంటపాలాల్లో నీరు నిలిచిపోయింది. కొన్నేళ్లుగా వంతెన కింద మట్టి పేరుకుపోవడంతో నీరు ప్రవహించే మార్గం మూసుకుపోయింది. గ్రామస్థులు ఈ విషయాన్ని మంత్రి స్వామి దృష్టికి తీసుకెళ్లగా ఆదివారం నీరు నిలిచిన ప్రాంతాల్లో గ్రామస్థులతో కలిసి పర్యటించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

వంతెనపై దారికాచిన ప్రమాదం!






పాతూరు చెక్ పోస్టు వద్ద వంతెనపై గుంతలు

వరుసగా కురుస్తున్న వర్షాలకు కనిగిరి పట్టణంలోని పాతూరు చెక్ పోస్టు సమీపంలో వంతెన దెబ్బతింది. 25 ఏళ్ల క్రితం నిర్మించిన కావడంతో పై భాగంలో తారు కొట్టుకు పోయింది. ఇనుప చువ్వలు బయటకు వచ్చి గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం ఒంగోలు, పొదిలి, విజయవాడ, హైదరాబాద్‌కు ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలు ఇదే బ్రిడ్జి పై వెళ్తుంటాయి. రాత్రి వేళ ఈ గుంతలు కనిపించక వాహనదారులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు లోతు గుంతల్లో పడి చోదకులు గాయాల పాలవుతున్నారు. ఆదివారం ఈ గుంతల్లో పడి ఇద్దరు ద్విచక్ర వాహనదారులు గాయాలపాలయ్యారు. వెంటనే ఆర్అండ్‌బీ అధికార్లు స్పందించి దెబ్బ తిన్న చోట మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ పిరోజ్‌ను వివరణ కోరగా.. త్వరలో టెండర్లు పిలిచి వంతెనకు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, కనిగిరి

మళ్లీ వరద ఉద్ధృతి

వర్షాలకు ముండ్లమూరు మండలంలో గుండ్లకమ్మ నది, వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. అల్పపీడన ప్రభావంతో గత కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నదితోపాటు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మారెళ్ల వద్ద ఈదరవాగు చప్టాపై నుంచి నాలుగు రోజులుగా వరద నీరు ప్రవహిస్తోంది. శనివారం పూర్తిగా ప్రవాహం తగ్గినా, ఆదివారం మళ్లీ చప్టాపై నుంచి రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. దీంతో చప్టా వద్ద రెండు వైపులా చిల్ల కంప వేసి రాకపోకలు సాగకుండా రెవెన్యూ, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. -న్యూస్‌టుడే, ముండ్లమూరు



ఈదరవాగు చప్టాపై ప్రవహిస్తున్న నీరు

కాజ్‌వేకు తాత్కాలిక మరమ్మతులు



మండలంలోని తూర్పుగంగవరం-దారంవారిపాలెం ప్రధాన రహదారిలో కొండవాగు కాజ్‌వే వర్షపు నీటి ఉద్ధృతి కారణంగా కోతకు గురైంది. దీంతో గత నాలుగు రోజుల నుంచి కేవలం ద్విచక్ర వాహనాలు మినహా ఇతర వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. ఆ గ్రామానికి చెందిన అధిక మంది ప్రజలు, రైతులు పలు వాహనాల్లో ఆ వైపు వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో సర్పంచి మందాల వెంకటేశ్వర్లు స్పందించారు. పంచాయతీ ఆధ్వర్యంలో కోతకు గురై ఏర్పడిన గండిని మట్టితో పూడ్చించారు. జేసీబీ సాయంతో కాజ్‌వేపై మట్టి పోయించి చదును చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. – న్యూస్‌టుడే, తాళ్లూరు

గ్రామాల్లో నిఘా తప్పనిసరి



వైర్‌లెస్ సెట్ పరిశీలిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు, న్యూస్‌టుడే: అపరిష్కృతంగా ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ సిబ్బందిని ఆదేశించారు. ముండ్లమూరు పోలీసు స్టేషన్‌ను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. వైర్‌లెస్ సెట్ మాట్లాడే సక్రమంగా పనిచేస్తుందా లేదా పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, అన్ని గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో నిఘా పెంచాలని, ప్రస్తుతం వర్షాల కురుస్తున్న నేపథ్యంలో వాగులు పొంగి ప్రవహిస్తున్నచోట అక్కడ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సై నాగరాజు, ఏఎస్సై వెంకటేశ్వరరెడ్డి, సీసీ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

దీపావళి టపాసుల పట్టివేత

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని రామాలయం వీధిలోని ఓ ఫ్యాన్సీ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన దీపావళి టపాసులను ఎస్సై టి.శ్రీరామ్ ఆధ్వర్యంలో ఆదివారం దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. దేవారం అనే వ్యక్తి దుకాణంలో రూ.87,440 విలువ చేసే టపాసులను సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేశారు. ఎస్సై మాట్లాడుతూ.. పట్టణంలో ఎవరైనా అనుమతి తీసుకోకుండా దీపావళి టపాసులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్తు పరివర్తకంపై పిడుగు

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెట్లూరు విద్యుత్తు ఉపకేంద్రంలో జీవీఎల్ పరివర్తకంపై పిడుగుపడి మంటలు వచ్చినట్లు ఏఈ కుంచాల కోటయ్య తెలిపారు. రూ.75 లక్షల విలువగల పరివర్తకం అయినందున విషయాన్ని వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసి వారి సూచనల మేరకు ఆదివారం పరిశీలించామన్నారు. పిడుగు పడిన వెంటనే సిబ్బంది గమనించి 33 కేవీ ప్రధాన సరఫరా లైన్‌ను నిలిపివేయడంతో పరివర్తకానికి ఎటువంటి సమస్య లేదన్నారు. చిన్న చిన్న సాంకేతిక లోపాలు వల్ల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేశామన్నారు. గ్రామస్థులకు సమస్య లేకుండా కొండపి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్తు సరఫరా ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

నారాయణస్వామి ఆలయ ప్రధాన అర్చకుడి మృతి



సత్యనారాయణశర్మ (పాత చిత్రం)

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ప్రధాన అర్చకులు మంకాల సత్యనారాయణశర్మ(62) ఆదివారం మృతి చెందారు. ఆయన గుండెపోటుకు గురికావడంతో బాధపడుతున్నారు. శీలంవారిపల్లిలోని ఆయన నివాసగృహంలో ఆదివారం ఆరోగ్యం క్షీణించి మరణించారు. విషయం తెలుసుకున్న ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ కె.చిన్నజీనారాయణ, ఈవో ఎస్.నరసింహబాబు, మాజీ ఛైర్మన్ పి.మాధవప్రసాద్‌లు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. 40 సంవత్సరాలుగా సత్యనారాయణశర్మ నారాయణస్వామి ఆలయంలో సేవలు అందిస్తున్నారని ఎందరికో సుపరిచితులు. దేవస్థానం తరఫున మట్టి ఖర్చుల నిమిత్తం ఈవో నరసింహబాబు, వ్యవస్థాపక ఛైర్మన్ రూ.25 వేల చెక్కును సత్యనారాయణ శర్మ కుమారుడికి అందజేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.


శిథిల భవనం.. నిత్యం భయం

న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

మండల కేంద్రం సింగరాయకొండలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. ఈ భవనాలు సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు స్లాబు నుంచి నీరు కిందికి వచ్చి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక విద్యుత్తు కార్యాలయం పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. పలు గదుల్లో స్లాబ్ పెచ్చులు ఊడి సిబ్బందిపై పడుతున్నాయి. కంప్యూటర్ గది పూర్తిగా దెబ్బతినడంతో దానిని మూసివేశారు. సిబ్బంది విధులు నిర్వహించే గదిలో పెచ్చులూడి వర్షాలు కురుస్తున్న సమయంలో గదుల్లో నీరు నిలిచి విలువైన పత్రాలు తడిసి ముద్దవుతున్నాయి. భవనం గోడలు పూర్తిగా చెమ్మతో నిండి పోతున్నాయి. భవనం పూర్తిగా దెబ్బతిని ఉండటంతో భయంగా విధులు నిర్వహిస్తున్నామని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా కార్యాలయం ముందు భాగంలో మడుగు కట్టి ఉంటుంది. దీంతో కార్యాలయానికి వచ్చే అధికారులు, ప్రజలు, సిబ్బంది రాకపోకలకు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు.

పోలీసు స్టేషనూ అదేపరిస్థితి..

స్థానిక పోలీసు స్టేషన్ భవనం సైతం దెబ్బతింది. ఇటీవల వర్షాలకు కార్యాలయం వరండా, మరుగు దొడ్లు, దస్త్రాలు భద్రపరిచే గదిలో వర్షపు నీళ్లు కారుతున్నాయి. దీంతో స్టేషనుకు వచ్చేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వివిధ గదుల్లో కిటికీల తలుపులు చెదలు పట్టి పూర్తిగా ధ్వంసమయ్యాయి. ముద్దాయిలను కేటాయించిన గది పూర్తిగా నీరు కారడంతో వారు నిలిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అక్కడే పోలీసు సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తుంది. ఎస్సై గదిలో వర్షపు నీరు కారుతుండటంతో ఇటీవల కాలంలో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. అలాగే తహసీల్దారు, వ్యవసాయశాఖ, పంచాయతీరాజ్, జలవనరుల శాఖ తదితర ప్రభుత్వ కార్యాలయాలు దెబ్బతిన్నాయి. కార్యాలయ గోడలు మట్టుకుంటే విద్యుత్తు షాక్ కొడుతుందని సిబ్బంది వాపోతున్నారు. ఈ కార్యాలయాల్లో విధులు నిర్వహించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్ భవనానికి మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్సై మహేంద్ర తెలిపారు.



శిథిలావస్థకు చేరిన విద్యుత్తు కార్యాలయ భవనం



పెచ్చులూడి ఇనుప చువ్వలు కనిపిస్తున్న స్లాబు

ఆధ్యాత్మిక గ్రంథాలతో ఆత్మజ్ఞానం

సి.ఎస్.పురం: సి.ఎస్.పురంలో ఆదివారం త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. భగవద్గీత చదివి ఆత్మజ్ఞానాన్ని తెలుసుకోవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు జి.ప్రసాద్ తెలిపారు. ఆధ్యాత్మిక గ్రంథాలతో ఆత్మజ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఎ.సురేష్, జి.పెంచలరత్నం, కె.నరసింహులు, కె.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.5.48 లక్షలు

దర్శి(తాళ్లూరు): దర్శిలో కొలువుదీరిన కనక దుర్గ అమ్మవారి ఆలయానికి రూ.5,48,195 ఆదాయం వచ్చింది. గత ఏడాది దసరా నుంచి ఇటీవల ముగిసిన దసరా వరకు నవరాత్రి కాలానికి ఆ మేరకు ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. దేవాదాయ అధికారుల సమక్షంలో ఆదివారం హుండీల్లోని కానుకలను లెక్కించారు.

మానవతా సంస్థకు నగదు అందజేత

దర్శి(తాళ్లూరు), న్యూస్‌టుడే: దర్శిలో మానవతా సంస్థకు ఫ్రీజర్ బాక్సు కోసం ఆదివారం ముందస్తుగా రూ.50 వేల నగదును దాత అందజేశారు. పసుపులేటి వెంకటనారాయణ తన తండ్రి పేరున దీనిని అందజేస్తామని హామీ ఇచ్చారు. దాని విలువ సుమారు రూ.80 వేల వరకు ఉండగా, ముందుగా ఆ మేరకు నగదును సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, ఆధ్యక్షులు డి.వెంకటరెడ్డి, వైస్ ఛైర్మన్ వాకా జనార్దనరెడ్డిలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పొదిలి మానవతా సంస్థ ఎడ్యుకేషన్ కమిటీ డైరెక్టరు బాదం వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. సంస్థ తరఫున దాతను అభినందించారు.

వాలీబాల్ జట్టుకు విద్యార్థి ఎంపిక

టంగుటూరు, న్యూస్‌టుడే: అండర్-17 జిల్లా వాలీబాల్ జట్టుకు టంగుటూరులోని పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి ఎంపికయ్యారు. జిల్లా వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 19న ఒంగోలులో నిర్వహించారు. ఈ నేపథ్యంలో కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న మహమ్మద్ రఫీ ప్రతిభ చూపి ఎంపికయ్యారు. ఈ నెల 21న అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపల్ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థికి జమ్ములపాలెంకి చెందిన ఎన్ఆర్ఐ బెజవాడ శ్రీనివాసరావు రూ.5 వేల నగదును ఆదివారం అందజేశారు.

కాయకష్టం.. కోలుకోలేని నష్టం

• పంటలు దెబ్బతిని రైతుల విలవిల

న్యూస్‌టుడే, తాళ్లూరు

అన్నదాతల ఆరుగాలం కష్టంతో పాటు, రూ.వేలకు వేలుగా పెట్టుబడులు పెట్టి కాపాడుకుంటున్న పంటలు వర్షార్పణమయ్యాయి. వర్షాలు తగ్గినట్లే తగ్గి, శని, ఆదివారాల్లో మళ్లీ భారీగా కురవడంతో తాళ్లూరు మండలంలోని పలు పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న, జొన్న, సజ్జ, వరి, గుమ్మడి పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో మండలంలో మంత్రి స్వామి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం పర్యటించి రైతులతో మాట్లాడారు. తమను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. దీనిపై ఏవో ప్రసాదరావును వివరణ కోరగా.. మండలంలోని సజ్జ 328, వరి వంద, జొన్న ఎనిమిది ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు తెలిపారు.



మొలకలు వచ్చిన మొక్కజొన్న కంకులు

ఫలసాయం చేతికొచ్చే సమయంలో..



తాళ్లూరు మండలం రామభద్రాపురానికి చెందిన బాలకృష్ణారెడ్డి ఎనిమిది ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. తన తల్లికి ఉన్న నాలుగు ఎకరాలతోపాటు మరో నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. ఎకరాకు రూ.పది వేలు చొప్పున కౌలు కడుతున్నారు. ఎకరాకు రూ.పాతిక వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పంట కోతకు వచ్చిన సమయంలో భారీ వర్షాలు పడడంతో జొన్న కంకులు బూజు పట్టి నల్లగా మారి మొలకలు వస్తున్నాయి. పంట చేతికి వచ్చే అవకాశాలు లేక పోవడంతో వాటిల్లే నష్టాన్ని ఎలా భరించాలో అర్థంకు కావడం లేదని రైతు ఆందోళనకు గురవుతున్నారు.

బూజు పట్టిన మొక్కజొన్న కండెలు



తాళ్లూరు మండలం కొత్తపాలెనికి చెందిన మారం లక్ష్మీరెడ్డి నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. రూ.1.20 లక్షలు ఖర్చు చేసి పెట్టుబడులు పెట్టారు. కొంత పంట కోతలు పూర్తి చేసి కల్లాల్లోనే ఆరబోశారు. వాటిపై పట్టాలు కూడా కప్పి తడవకుండా రక్షణ ఏర్పాట్లు చేశారు. అయినప్పటికీ వర్షం కురిసి కండెలు తడిసి పోయాయి. మొలకలు వచ్చి పూర్తిగా దెబ్బతిన్నాయి. కోతలు పూర్తి చేయని పంట కండెలు బూజు పట్టాయి. ఈ నష్టాలను తలుచుకుని రైతు లబోదిబోమంటున్నారు.

మోగిన బ్యాంకు అలారం

కనిగిరి: పట్టణంలోని బోయపాలెం సమీపంలోని ఓ బ్యాంకులో అలారం మోగడంతో దొంగలు పడ్డారని బ్యాంకు అధికార్లు ఒక్కసారిగా కంగారు పడిన పరిస్థితి ఆదివారం రాత్రి జరిగింది. స్థానిక ఎస్‌బీఐ బ్యాంకుకు ఆదివారం సెలవు కావడంతో బ్యాంకుకు తాళాలు వేసి వెళ్లారు. రాత్రి 9 గంటల సమయంలో బ్యాంకులో అలారం మోగడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్సై టి.శ్రీరామ్ ఆక్కడకు చేరుకుని బ్యాంకు సిబ్బంది పిలిపించి తాళాలు తీసి లోపల చూడగా ఎవరూ లేరు. విద్యుత్తు బోర్డులో కట్టి వెళ్లడంతో ఒక్కసారిగా షార్ట్‌సర్క్యూట్ జరిగి అలారం మోగినట్లు ఎస్సై తెలిపారు.

తెగుళ్ల నివారణకు దశపర్ని కషాయం

మర్లపాడు(టంగుటూరు), న్యూస్‌టుడే: పంటలకు వచ్చే తెగుళ్ల నివారణకు దశపర్ని కషాయంతో మేలు చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి టి.విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మర్లపాడులో ప్రకృతి సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులతో కలిసి దశపర్ని కషాయాన్ని తయారు చేసి వినియోగించడంలో తెగుళ్ల నివారణ తయారీపై మహిళా రైతులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో దొరికే పది రకాల మొక్కల ఆకులు, ఆవుపేడ, ఆవుమూత్రం, పసుపు, పచ్చిమిర్చి వంటి వాటితో ఈ కషాయాన్ని తయారు చేసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ సిబ్బంది సుజాత, మరియమ్మ, త్రివేణి, హరిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ముండ్లమూరు, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధిలో అంతా భాగస్వాములు కావాలని ఎంపీడీవో రావూరి జనార్దన్ కోరారు. మండలంలోని వేంపాడు, భీమవరం, తూర్పుకంభంపాడు గ్రామాల్లో పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో సీసీరోడ్లు, సైడు కాలువలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పేరం మండల ఆధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఏపీవో నాగరాజు, ఏఎంఎం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

ఎస్టీయూ మండల అధ్యక్షుడి నియామకం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రీయ ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) చీమకుర్తి మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నగరంలోని నారాయణ స్కూలులో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల అధికారిగా నర్రా కోటేశ్వరరావు వ్యవహరించారు. కె.శ్రీనివాసులు అధ్యక్షుడిగా, ఎస్కే ఖాదర్‌బాషా ప్రధాన కార్యదర్శిగా, డి.రమణయ్య ఆర్థిక కార్యదర్శిగా, ఎం.జ్యోతి మహిళా కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొన్ని తీర్మానాలు ఆమోదించారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావల్సిన డీఏ బకాయిలు, 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, ఏపీజీఎల్ఐ, పీఎఫ్ రుణాల దరఖాస్తులు పరిష్కరించాలని కోరారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా శేషుబాబు

ఒంగోలు గ్రామీణం: ఒంగోలు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా యు.శేషుబాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం కార్యాలయ పరిపాలనాధికారిగా కొనసాగుతున్నారు. ప్రస్తుత ఎంపీడీవో రాజశేఖర్ వ్యక్తిగత అవసరాల నిమిత్తం సెలవు పెట్టారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి 11 కేవీ విద్యుత్తు లైన్‌లో ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేస్తుండడం వల్ల పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వి.శ్రీనివాసరావు తెలిపారు. చినరాస్తా రహదారి, మెయిన్ రోడ్, అంబేడ్కర్ నగర్, ఎన్ఎస్పీ కాలనీ, ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం, రామ్‌నగర్ ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన చెప్పారు.


రేపటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కొత్తపట్నం, న్యూస్‌టుడే: కొత్తపట్నం-1 గ్రామ సచివాలయంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఈవోఆర్డీ వేణు తెలిపారు. 22న గుండమాల, 23న మోటుమాల, 24న రంగాయపాలెం, 25న కె.పల్లెపాలెం గ్రామాల ప్రజలు తమ ఆధార్ వివరాలను నవీకరించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

కాలనీ కష్టాలు

చిట్టడవుల్లా ఖాళీ స్థలాలు

చీమకుర్తి పురపాలక సంఘం పరిధిలోని పలు కాలనీల్లో శివారు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. దోమలు, పాములకు ఆవాసాలుగా మారుతున్నాయి. గెలాక్సీపురిలోని గాంధీనగర్ మొదటి వీధి మొదలు తొమ్మిదో బజారు వరకు నివాస గృహాలు, శివారు ప్రాంతాల మధ్య అనేక ఖాళీ స్థలాలు ఉన్నాయి. రామనగర్ శివారు ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి. వర్షాకాలం ప్రారంభం అయ్యిందంటే ఆయా స్థలాల్లో చిల్లచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి పోతున్నాయి. వాటిని తొలగించే దిశగా స్థలాల యజమానులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. గాంధీనగర్ ఐదు, ఆరో వీధి శివారు ప్రాంతాల్లో పాములు సంచరిస్తుండటంతో విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యం వారు జేసీబీ ఏర్పాటు చేయించి సుమారుగా రూ.30 వేలు వెచ్చించి చెట్లను తీయించారు. నివాస ప్రాంతాల్లో ఈ రీతిలో చెట్లు పెరిగిపోతున్న పరిస్థితుల్లో వాటిని తొలగించే దిశగా పురపాలక సంఘం వారు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య స్పందిస్తూ.. ఖాళీ స్థలాల్లో ఉన్న చెట్లు, పిచ్చిమొక్కలను తొలగింపచేయాలని యజమానులకు త్వరలో తాఖీదులు జారీ చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, చీమకుర్తి



గాంధీనగర్ మొదటి వీధిలో ఇలా...

పూడిక తీశారు.. వదిలేశారు

నగరంలోని దేవునిచెరువు ప్రాంతంలో అపరిశుభ్రం నెలకొంది. పారిశుద్ధ్య సిబ్బంది మురుగు కాలువల నుంచి పూడిక తొలగించి అలాగే వదిలేస్తున్నారు. వాటిని తొలగించకపోవడంతో అధ్వానంగా మారుతున్నాయి. వర్షం కురిసినప్పుడు అదంతా కాలువలోకి చేరుతుంది. మళ్లీ నీరు రంగు మారి వస్తోంది. అరగంట పాటు నీరు పట్టుకోకుండా కాలువలో వదిలేసి.. కొంతం రంగు మారక పట్టుకుంటున్నామని స్థానికులు వాపోతున్నారు.



కాలువ నుంచి తీసిన పూడికను తొలగించని దృశ్యం

నిర్మలనగర్‌లో కుక్కల బెడద

నగరంలో ప్రధాన ప్రాంతాల్లో ఒకటి అయిన నిర్మల్‌నగర్‌లోని ప్రజలు కుక్కలు బెడదతో ఆందోళన చెందుతున్నారు. గుంపుగుంపులుగా శునకాలు సంచరిస్తూ రాత్రివేళ ద్విచక్ర వాహనదారుల వెంట పడుతున్నాయి. ఇక నిర్మల స్కూల్ రోడ్డులో చెత్తను పోస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది.. అటుగా వెళ్లే వారు ముక్కు మూసుకుని పోవాల్సి పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు. అలాగే చెట్ల కొమ్మలు విద్యుత్తు తీగలకు వెళ్తుండటంతో కొన్నిసార్లు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వాటిని తొలగించాలని వారు కోరుతున్నారు.



\- న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్య రోడ్డు

దళిత, గిరిజనులపై దాడులు నియంత్రించాలంటూ ఆందోళన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాలని కోరుతూ ఇండిపెండెంట్ లేబర్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం మాట్లాడుతూ.. కేంద్రంలో భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళిత, గిరిజనులపై దాడులు పెరిగాయన్నారు. 2018లో ఆ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని రద్దు చేసే ప్రయత్నం చేసిందని విమర్శించారు. తాజాగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయాలని రాజ్యాంగానికి వ్యతిరేకంగా ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి సంగీతరావు, దాసరి నరసింహారావు, గుత్తి కోటేశ్వరరావు, నరసింహారావు, సుబ్బారావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన ప్రదర్శన



ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న కమిటీ ప్రతినిధులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు గ్రామీణం, ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో ఆదివారం జరిగిన సమావేశంలో జేసీఐ ఒంగోలు నూతన కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎం.వెంకట సుబ్బారావు, కార్యదర్శిగా మాజేటి గణేష్, కోశాధికారిగా వీరబ్రహ్మంతోపాటు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జేసీఐ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ఆకృతి రాము తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలోకి వర్షపు నీరు

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఆదివారం తెల్లవారు జామున రామతీర్థం, మర్రిచెట్లపాలెం, ఆర్ఎల్‌పురం, తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రామతీర్థంలోని గంగమ్మ ఆలయంలోకి భారీగా వర్షపు నీరు చేరింది. ఉదయం ప్రాంతంలో గర్భగుడిలోకి కూడా నీరు చేరడం పరిశీలనాంశంగా మారింది. సెలవు దినం కావడంతో వివిధ రకాల మొక్కులు చెల్లించుకొనేందుకు భక్తులు పెద్దఎత్తున క్షేత్రానికి వచ్చారు. అమ్మవారి దర్శనం సమయంలో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. నిర్వాహకులు మోటారు ఏర్పాటు చేసి నీటిని బయటకు వెళ్లగొడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి చోదకుడికి గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. 216వ జాతీయ రహదారిపై ఒంగోలు నుంచి ఉప్పుగుండూరు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న గోడను ఢీకొన్నాడు. దీంతో అతడికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రుడ్ని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుడు స్పృహలోకి రాలేదని... అతని వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఆటో- ద్విచక్ర వాహనం..

చీమకుర్తి: చీమకుర్తి గోనుగుంట రహదారిలో ఆదివారం ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో వెంకటేశ్వర్లు అనే వ్యక్తి గాయపడ్డారు. ద్విచక్ర వాహనంపై చీమకుర్తి నుంచి గోనుగుంట వెళ్తున్న ఈ సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067 ఒంగోలు గ్రామీణం : 8008564455

ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766

ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే:

?: నగరంలోని రాజపానగాల ఒకటో వీధిలో కాలువల శుభ్రం చేయటంలేదు. కాలువల నుంచి దుర్వాసన వస్తుంది. కాలువలు శుభ్రం చేసేలా చేయగలరు. – జనార్దన్, స్థానికుడు.

✓: వెంటనే కాలువలను శుభ్రం చేయించి ఆ ప్రాంతంలో సమస్య లేకుండా చూస్తాం.– పిచ్చయ్య, శానిటరీ సూపర్‌వైజర్

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: పలు ప్రాంతాల్లో సేకరించిన వ్యర్థాలను తీసుకొచ్చి రంగారాయుడు చెరువు పక్కన పోస్తుండటంతో దుర్వాసనకు ఉండలేక పోతున్నామని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా తెలియజేశారు. స్పందించిన శానిటరీ సూపర్‌వైజర్ ఎన్.పిచ్చయ్య ఆదివారం సిబ్బందిని పంపించి అక్కడ శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.
● నగరంలోని శర్మ కళాశాల రోడ్డులో వర్షపునీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా కార్యక్రమానికి తెలియజేయగా కమిషనర్ కె.వెంకటేశ్వరరావు స్పందించి ఆదివారం జేసీబీ సాయంతో కచ్చాకాలువ తీయించి సమస్య పరిష్కరించారు.

గ్రామాల్లో వసతుల కల్పనకు కృషి

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. 'పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాల్లో' భాగంగా మండంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల నెరవేర్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి, మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ మారెళ్ల వెంకటశేషయ్య, అధికారులు పాల్గొన్నారు.
● నాగులుప్పలపాడులో జరిగిన పల్లె పండగకు అధికార పార్టీకి చెందిన ఓ వర్గం నాయకులు హాజరుకాలేదు. ఇటీవల పార్టీలో చేరిన వారికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ తమను విస్మరిస్తున్నారని వాపోయారు.



అమ్మనబ్రోలులో ఆవిష్కరించిన శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, నాయకులు

విజయనగర్‌కాలనీలో సమస్యలు తిష్ట

నగరంలోని 31వ డివిజన్‌లో భాగంగా ఉన్న విజయనగర్‌కాలనీ ఒకటో లైన్‌లో అపారిశుధ్యం నెలకొంది. వీధులను శుభ్రం చేయకపోవడంతో చెత్తంతా వర్షానికి తడిచి రోడ్డుకు అతుకొని దుర్వాసన వాస్తోంది. అదే మార్గంలో ఉన్న రైల్వేకు సంబంధించిన స్థలంలో చిల్లచెట్లు గుట్టలుగా పెరిగిపోయాయి. వాటిలో విషపురుగులు చేరి నివాసాల్లోకి వస్తున్నాయని వాటిని శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఆరో లైన్‌లో నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. నీరు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు రాదో.. అర్థం కావడం లేదని.. డబ్బా నీటిని కొనుక్కొని తాగాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్య రోడ్డు



దట్టంగా పెరిగిన చిల్ల చెట్లు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

గంగవరం(సంతనూతలపాడు): మండలంలోని గంగవరంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 290 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని హనుమంతరావు ప్రైవేటు ఉన్నత పాఠశాల్లో సేవా సంకల్ప ఛారిటబుల్ ట్రస్టు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కిమ్స్ శంకర్ కంటి ఆసుపత్రి, ఎంఎన్ఆర్ క్యాన్సర్ వైద్యశాలల సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు 106 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 22 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి, సొసైటీ ఛైర్మన్ శనగల వెంకటరమణ, పాఠశాల కరస్పాండెంట్ బొడ్డు హనుమంతరావు, ట్రస్టు వైస్ ఛైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి వేమా కవిత పలువురు పాల్గొన్నారు.

ఈదుమూడిలో... నాగులుప్పలపాడు: ఈదుమూడిలో మనం-మనఊరు-మన ఈదుమూడి సేవా సంస్థ వ్యవస్థాపకుడు కావూరి వాసు ఆధ్వర్యంలో శ్రీరామ్ మల్టీస్పెషాలిటీ వైద్యశాల సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు వంశీకృష్ణ, సౌమిత్ర పల్లవ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఎన్‌పాడులో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

జూదరుల అరెస్ట్: మద్దిపాడు: మండల పరిధిలో లింగంగుంట గ్రామంలో జూదమాడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. అందిన సమాచారంతో ఎస్సై శివరామయ్య తమ సిబ్బందితో జూదశిబిరంపై దాడి చేశారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5,570ల నగదును స్వాధీనం చేసుకున్నారు.

మద్యం దుకాణం తొలగించాలని డిమాండ్

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: పెద్ద బజారులో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ స్థానికులు ఆదివారం రెండో రోజు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థులు తిరిగే చోట, దేవాలయాలున్న ప్రాంతంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ ప్రాంతం నుంచి మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరారు.

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరులో గంగమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని గ్రామస్థులు ఆదివారం నిరసన చేపట్టారు. ఏర్పాటు చేసిన బెల్టు షాపు సమీపంలో అంకమ్మ, మహాలక్ష్మమ్మ, పోలేరమ్మ దేవాలయాలు ఉన్నాయని.. దగ్గరలోనే ఉన్నత పాఠశాల ఉందని వాపోయారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు.



ఎస్ఎన్‌పాడు: నిరసన తెలుపుతున్న స్థానికులు

రహదారిపై గుంతలు పూడ్చాలని నిరసన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు నగరంలోని 50వ డివిజన్ జయప్రకాష్ కాలనీ ఎక్స్‌టెన్షన్ రోడ్డు ఏర్పడిన గుంతలు తక్షణమే పూడ్చాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు, మహిళలు ఆదివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి జి.రమేష్ మాట్లాడుతూ.. వర్షాలతో రోడ్డు మీద గుంతలు ఏర్పడి రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాలనీలో రోడ్డు వేయాలని గతంలో విన్నవించినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం స్పందించి శివారు కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.




జయప్రకాష్ కాలనీలో నినాదాలు చేస్తున్న నాయకులు, మహిళలు

దాతల తోడ్పాటు.. కాలువలకు కొత్త రూపు

చీమకుర్తి, న్యూస్‌టుడే

గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన సాగరు కాలువలు ప్రస్తుతం కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. దాతలు అందజేస్తున్న తోడ్పాటుతో రైతులు యంత్రాలను ఏర్పాటు చేసుకొని కాలువల్లో పేరుకుపోయిన పూడిక, వ్యర్థాలను తొలగించుకుంటున్నారు. ప్రధాన కాలువ నుంచి నీరు తీసుకొనే తూములు, వాటి తలుపులకు మరమ్మతులు నిర్వహింపజేసుకుంటున్నారు. గత ప్రభుత్వం సాగరు కాలువల నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో లోపలి భాగంలో పూడిక, పిచ్చిమొక్కలు, ఇతర వ్యర్థాలు పేరుకుపోయిన పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో దిగువకు నీరు పారక ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక నాయకుల ద్వారా సమస్యను పలువురు దాతల దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించి ప్రొక్లెయిన్‌లు సమకూరుస్తుండటంతో రైతులు కాలువలు శుభ్రం చేయించుకుంటున్నారు.



పూడిక, చిల్ల చెట్లు తొలగించిన తర్వాత అగ్రహారం మేజర్ కాలువ

2.5 కిలోమీటర్ల మేర పూడిక తొలగింపు..

సాగరు అగ్రహారం మేజర్ కాలువను శుభ్రం చేసేందుకు కృష్ణసాయి గ్రానైట్స్ యాజమాన్యం వారు ముందుగా ప్రొక్లెయిన్ అందజేశారు. దీనిద్వారా రైతులు వారం రోజుల పాటు కాలువపై పనులు చేయిస్తున్నారు. 2.5 కిలోమీటర్ల పరిధిలో పూడిక, చిల్ల చెట్లు తొలగింప చేశారు. కట్టలపైన రాక పోకలకు వీలుగా రహదారి నిర్మాణం చేసుకున్నారు. ఈ పనులను సంబంధిత శాఖ వారు అంచనాల ప్రకారం నిర్వహించాలంటే సుమారుగా రూ.5 లక్షల వరకు వెచ్చించాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు.



ఓబీసీపై కారుమంచి మేజర్ హెడ్ వద్ద ఏర్పాటు చేసిన తలుపులు

రూ. 20లక్షల మేర నిధులు వెచ్చించి..

నిర్దేశిత సామర్థ్యంలో మూడో వంతు కూడా నీరు రాక పోతుండటంతో కారుమంచి మేజర్‌కాలువ రైతులు రెండేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒంగోలు బ్రాంచి ప్రధాన కాలువ నుంచి కారుమంచి మేజర్ కాలువ ప్రారంభమయ్యే ప్రాంతంలో (హెడ్‌వద్ద) కనీసం తూములు, తలుపులు కూడా సక్రమంగా లేని పరిస్థితి. ఈ విషయాలను కేవీపాలెంకు చెందిన రైతులు తమ గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు నల్లూరి వెంకట శేషయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి కాలువ మరమ్మతులకు ముందుకొచ్చారు. సుమారు రూ.మూడు లక్షలతో మేజర్ హెడ్ ఓబీసీలో తూములకు మరమ్మతులు చేయించి తలుపులు ఏర్పాటు చేశారు. సుమారు 10 కిలోమీటర్ల పరిధిలో కాలువలో పూడిక తీత, చెట్లు తొలగింప చేసే పనులు చేస్తున్నారు. ఇందు కోసం మరో రూ.20 లక్షలకు పైగా వెచ్చిస్తున్నారు. పిచ్చి మొక్కలు తొలగి పోయి కాలువ కొత్తగా కనిపిస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.